

'ఏపీ రెసిడెన్షియల్'లో అడ్మిషన్లకు దరఖాస్తుల ఆహ్వానం

నెల్లూరు (విద్య) : జిల్లాలోని ఏపీ రెసిడెన్షియల్ స్కూల్స్ (మైనార్టీ)లో 5 నుంచి 8వ తరగతిలు, ఏపీ రెసిడెన్షియల్ జూనియర్ కళాశాలలో (మైనార్టీ) నేరుగా ప్రథమ సంవత్సరం అడ్మిషన్లు పొందేందుకు విద్యార్థులు దర ఖాస్తు చేసుకోవాలని విద్యా శాఖ ఏడీ గ్లోరీకుమారి ఒక ప్రకటనలో తెలిపారు. పాఠశాలలు, కళా శాలల ప్రిన్సిపాళ్లకు ఇప్పటికే అనుమతులు ఇచ్చామని, ఆయా విద్యాసంస్థల్లోనే నేరుగా కలిసి అడ్మిషన్లు పొందాలని సూచించారు. పాఠశాలల్లో ఈ నెల 12న, కళాశాలల్లో 18వ తేదీ వరకు అడ్మిషన్లు పొందవచ్చని పేర్కొన్నారు.

అన్నా.. గుర్తున్నానా!?

- ఎమ్మెల్యేలను ప్రసన్నం చేసుకుంటున్న అధికారులు
- టీడీపీ కార్యాలయాలు, ఇళ్లకు క్యూ
- ఆచితూచి వ్యవహరిస్తున్న శాసన సభ్యులు

నమస్తే అన్నా... నేను మీ శ్రేయోభిలాషిని. అప్పుడు మీరు ఫోన్ చేసినప్పుడల్లా వివరాలు ఇచ్చింది నేనే!

సర్ నేను గుర్తున్నానా!? మీ పైన కేసు పెట్టబోతుంటే ఆ సమాచారం మీకు ఇచ్చింది నేనే!

బాస్ బాగున్నారా!? మీ విజయం అద్భుతం. మీకు తిరుగులేదు. కాస్త నా సంగతి చూసుకోండి. మీకు విధేయుడిలా ఉంటా!.



ఇదీ అధికారుల వరుస. ప్రస్తుత ఎన్నికల్లో విజయం సాధించిన ఎమ్మెల్యేలను ప్రసన్నం చేసుకునేం దుకు క్యూ కడుతున్నారు. రాష్ట్రంలో కొత్త ప్రభుత్వం కొలువు తీరుతున్న నేపథ్యంలో సాధారణ బదిలీలు జరిగే అవకాశం ఉండటంతో తమకు అనుకూల పోస్టుల్లో తిష్ట వేసేందుకు ఆశావహులు టీడీపీ ఎమ్మెల్యేల కార్యాలయాలు, వారి ఇళ్ల వద్దకు చేరుతున్నారు. తమకు అనుకూలమైన నేతలను రంగంలోకి దింపి పోస్టింగ్‌లు పొందేందుకు విశ్వప్రయత్నాలు చేస్తున్నారు. అయితే, ఐదేళ్ల పాటి ప్రతిపక్ష అనుభవాలను నెమరువేసుకుంటున్న ఎమ్మెల్యేలు ఆచితూచి వ్యవహరిస్తున్నారు.

వైసీపీ అధికారాన్ని అనుభవించిన ఐదేళ్లలో అధికారులు టీడీపీ నేతలు, నాయకులకు కనీస గౌరవం ఇవ్వకపోగా, సగటు సమాచారం కూడా అందించలేదు. వైసీపీ ప్రజాప్రతి నిధుల ఆదేశాలను అనుసరిస్తూ టీడీపీ నాయకత్వాన్ని కార్యాల యాల దగ్గరకు కూడా రాని వ్వలేదు. ప్రస్తుత ఎన్నికల్లో అంచ నాలన్నీ తిరగబడి ఊహిం చని రీతిలో టీడీపీ అధికారంలోకి వచ్చింది. ఈ నెల 12వ తేదీ న చంద్రబాబు అధ్యక్షతన కొత్త ప్రభుత్వం రాష్ట్రంలో కొలువుతీరనున్నది. ఈ నేపథ్యంలో అధికారుల బదిలీలు అనివార్య మని తెలుస్తోంది. ఇందుకు ముందుగానే సిద్ధమవుతున్న యంత్రాంగం తమకు అనుకూలమైన ప్రాంతాలను ఎంపిక చేసుకుంటు న్నారు. ఎన్నికల ఫలితాలు ప్రకటించక ముందే ఎగ్జిట్ పోల్స్ వచ్చిన నాటి నుంచి ప్రస్తుత ఎమ్మెల్యేల వద్దకు వాలిపోయారు. అంతేగాక తమకు అనుకూలంగా ఉన్న నేతల వద్దకూ క్యూ కడుతున్నారు.

\- నెల్లూరు రూరల్

ఇప్పుడెలా!?

అవినీతి అధికారుల్లో వణుకు



- ప్రభుత్వం మారడంతో వారి గుండెల్లో రైళ్లు
- ఐదేళ్లుగా పలువురు విచ్చలవిడితనం
- వైసీపీ నేతల దోపిడీకి పూర్తి సహకారం
- ఇప్పుడు తప్పించుకునేందుకు విశ్వప్రయత్నాలు
- టీడీపీ నేతల ఇళ్ల చుట్టూ ప్రదక్షిణలు

నెల్లూరు, జూన్ 7 (ఆంధ్రజ్యోతి) : అవినీతి, అరాచకాలు ఏ స్థాయిలో ఉంటాయో ప్రజలు గడిచిన ఐదేళ్లలో చూశారు. చట్టాలు వర్తించవు.. నిబంధనలు పనికిరావు.. తాము ఏం చెబితే అదే శాసనం.. అన్నట్టుగా వైసీపీ నేతలు వ్యవహరించారు. వీరికి పలువురు అధికారులు జత కట్టారు. తిలాపాపం తలా పిడికెడు అన్నట్టుగా ప్రజాధనాన్ని అటు వైసీపీ నేతలు, ఇటు అవినీతి అధికారులు పంచుకున్నారు. భూముల రికార్డులు మార్చడం నుంచి మట్టి, గ్రావెల్ అక్రమ రవాణా వరకు విచ్చలవిడిగా చేశారు. కొన్ని శాఖల్లో అసలు పనులు చేయకుండానే బిల్లులు పెట్టుకొని తినేశారు. కొందరు అధికారులైతే మరీ బరితెగిం చారు. చేసిన తప్పులకు సంబంధించి ఆధారాలు బయటకు వచ్చినా జంకలేదు. అక్రమాలకు పాల్పడుతూనే వచ్చారు. జిల్లా ఉన్నతాధికారులు కూడా వారి అరాచకాలకు బ్రేకులు వేయకుండా పరోక్షంగా సహకరించారు. కానీ ఇప్పుడు ప్రభుత్వం మారడంతో అవినీతి అధికారుల గుండెల్లో రైళ్లు పరిగెడుతున్నాయి. తమ అవినీతి, అక్ర మాలను ఎక్కడ బయటకు తీస్తారోనని వణికి పోతున్నారు. గడిచిన మూడు రోజులుగా కొందరు అధికారుల ముఖాల్లో టెన్షన్ కనిపిస్తోందని ఆయా శాఖల ఉద్యోగులు చెబుతున్నారు. సరిదిద్దుకో లేని పాపాలు చేసిన ఈ అధికారులు.. ఇప్పుడు తప్పించుకునే మార్గాలను వెతుక్కుంటుండటం గమనార్హం.

గడిచిన ఐదేళ్లలో రెవెన్యూ శాఖ వ్యవహరించిన తీరుపై తీవ్ర విమర్శలు ఉన్నాయి. వీఆర్వో దగ్గర నుంచి ఆర్డీవో స్థాయి అధికారి వరకు అనేక మందిపై ఆరోపణలు వెల్లువెత్తాయి. రెవెన్యూ రికార్డులు మార్చేయడం చాలా మండలాల్లో ఒక అలవాటుగా మారిపోయింది. ఒకరి పేరు మీద ఉన్న భూమిని మరొకరి పేరుపై మార్చేశారు. అందులోనూ ప్రభుత్వ భూముల విషయంలోనైతే విచ్చలవిడిగా వ్యవహరించారు. కొన్ని వేల ఎకరాల ప్రభుత్వ భూములను రెవెన్యూ అధికారులు ధారాదత్తం చేశారు. 22ఏలో ఉన్న ప్రభుత్వ భూములను కూడా దొంగ రికార్డుల ఆధారంగా నిషేధిత జాబితాల నుంచి తొలగించారు. పేదలకు అసైన్‌మెంట్ భూముల పంపిణీ, ఇరవై సంవత్సరాలకు ఫ్రీహోల్డ్ హక్కుల పేరుతో భారీ అక్రమాలకు తెరలేపారు. చాలా మంది తహసీల్దార్లు, పలువురు ఆర్డీవోలు ఈ కుంభకోణంలో పాత్రధారాలుగా ఉన్నట్లు ప్రతిపక్షంలో ఉన్నప్పుడు టీడీపీ నేతలు ఆధారాలతో సహా ఆరోపిస్తూ వచ్చారు. అలానే ప్రభుత్వ భూముల్లో ఇష్టానుసారంగా గ్రావెల్, మట్టి, తెల్లరాయి తవ్వకాలు జరిగినా రెవెన్యూ అధికారులు పట్టించుకోలేదు. ఇప్పుడు ఈ కుంభకోణాలపై విచారణలు జరిగితే చాలా మంది అధికారులు, ఉద్యోగులు ఇరుక్కుపోయే అవకాశాలు ఉన్నాయి.

భూ కుంభకోణాలే అధికం

- ఇరిగేషన్ శాఖలో కూడా భారీగా అవినీతి జరిగినట్లు టీడీపీ నేతలు ఆధారాలతో సహా గతంలో బయటపెట్టారు. పనులు చేయకుండానే చేసినట్లుగా చూపించి బిల్లులు తినేసిన ఘటనలు కూడా ఉన్నాయి. ఒకే పనికి రెండు, మూడు సార్లు బిల్లులు డ్రా చేసిన ఉదంతాలు కూడా వెలుగులోకి వచ్చాయి. చెరువుల్లో విచ్చలవిడిగా గ్రావెల్, మట్టి తవ్వకాలు జరిగినా పట్టించుకోకుండా అధికార పార్టీ నేతల దోపిడీకి సహకరించారు.

కొందరు అధికారులు కొత్తగా ఎన్నికైన టీడీపీ ఎమ్మెల్యేల ఇళ్ల చుట్టూ ప్రదక్షిణలు చేస్తుండగా, మరికొందరు ఈ ఎమ్మెల్యేలకు మొహం చూపించలేక వారికి దగ్గరగా ఉండే టీడీపీ నేత లను ప్రసన్నం చేసుకుంటున్నారు. 'మేము మీ మనుషులం..' అని చెప్పుకునే ప్రయత్నాలు మొదలుపెట్టారు. ఇదే ఇప్పుడు ప్రభుత్వ ఉద్యోగుల్లో చర్చనీయాంశంగా మారింది. అయితే టీడీపీ ఎమ్మెల్యేలు, నేతలు అవినీతి అధికారుల ప్రవర్తనను నిశితంగా గమనిస్తున్నారు.

- హౌసింగ్ శాఖలోనైతే అవినీతి ఏ స్థాయిలో జరిగిందో ప్రత్యేకంగా చెప్పాల్సిన పనిలేదు. జగనన్న లేఅవుట్లకు భూమి కొనుగోలుతో మొదలైన అక్రమాలు, ఇళ్లు నిర్మించకుండానే బిల్లులు తినేసే వరకు జరిగాయి. ఇందులోనే రూ.వందల కోట్ల అవినీతి జరిగినట్లు ఆరోపణలున్నాయి. కొన్ని వ్యవహారాలు గతంలో వెలుగులోకి కూడా వచ్చాయి. అయితే ఇందులో సూత్రధారులు వైసీపీ నేతలు, అధికారులే కావడంతో నాడు వైసీపీ ప్రభుత్వం వీటిని పట్టించుకోలేదు. ఇప్పుడు హౌసింగ్‌పై విచారణ ప్రారంభమైతే అనేక మంది అధికారులు ఇళ్లకు వెళ్లడం ఖాయమని ఆ శాఖలోనే చెప్పుకుంటుండటం గమనార్హం.



చెరువు కాదండోయ్... రోడ్డే!

ఇదేదో చెరువు అనుకోనేరు. రోడ్డేనండి ఇది. కావలిలోని ముసునూరు ఆటోనగర్ వద్ద ట్రంకురోడ్డు దుస్థితి ఇలా ఉంది. శుక్రవారం మధ్యాహ్నం కురిసిన కొద్దిపాటి వర్షానికే ట్రంకురోడ్డులో నీళ్లు నిలిచిపోయాయి. దీంతో వాహన రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. కొత్త ప్రభుత్వంలోనైనా ట్రంకురోడ్డుకు మోక్షం లభిస్తుందేమోనని పట్టణవాసులు ఆశగా ఎదురు చూస్తున్నారు. - కావలి (టౌన్)



రైతు భరోసా కేంద్రం వద్ద..

సచివాలయాలు, ఆర్బీకేలపై పసుపు జెండా రెపరెపలు

ఉదయగిరి అసెంబ్లీ పరిధిలోని జలదంకి మండలం జమ్మలపాలెంలోని సచివాలయం, రైతుభరోసా కేంద్రాల వద్ద ఎన్డీఏ కూటమి జెండాలు రెపరెపలాడాయి. ఈ భవనాలపై ఉన్న మాజీ సీఎం జగన్ చిత్రాలు తొలగించి వాటిస్థానంలో చంద్రబాబు, పవన్, ఎమ్మెల్యే కాకర్ల సురేష్ ఫొటోలతో ఉన్న చిత్రాలను అంటించారు. ఆ తర్వాత భవనాలపైకి ఎక్కి ఆయా పార్టీల జెండాలను చూతబట్టుకుని కేరింతలు కొట్టారు.

\- జలదంకి



గ్రామసచివాలయం బోర్డు పక్కన చంద్రబాబు, పవన్ ఫొటోలు అతికించి టీడీపీ జెండాలతో యువత




జొన్నవాడలో ముగిసిన ఉత్సవాలు

- అశ్వవాహనంపై కామాక్షితాయి దర్శనం

బుచ్చిరెడ్డిపాళెం, జూన్ 7 : జొన్నవాడ క్షేత్రంలో జరుగుతున్న మల్లికార్జునస్వామి, కామాక్షితాయి బ్రహ్మోత్సవాలు శుక్రవారం ఏకాంతసేవతో ముగిశాయి. చివరి రోజు ఉదయం ఆలయంలో పండితులు, పురోహితులు, అర్చకుల వేదమంత్రాల నడుమ ధ్వజావరోహణం చేశారు. ముందుగా స్వామి, అమ్మవార్లకు అలకలతోపు కార్యక్రమం నిర్వహించారు. ఆలయం నుంచి అలిగివెళ్తున్న కామాక్షితాయిని, వారి తరపు పెద్దలను, పెళ్లికొడుకు మల్లికార్జునస్వామి, వారి తరపు పెద్దలు నచ్చజెప్పి ఆలయానికి తీసుకొచ్చే సన్నివేశం భక్తులను ఆకట్టుకుంది. రాత్రి అశ్వవాహనంపై ఆదిదంపతులు భక్తులకు దర్శనమిచ్చారు. ఈఓ వి.గిరికృష్ణ తదితరులు పాల్గొన్నారు.

కళావిహీనంగా సోమశిల




క్లస్టర్ గేట్లకు దిగువున ఉన్న నీరు




డ్యాం ముఖద్వారం వద్ద పర్యవేక్షణ లేని దృశ్యం

జిల్లా ఆయువుపట్టు సోమశిల జలాశయం నీరు లేక కళతప్పింది. ఉన్న నీరు పాతాళానికి చేరుకోవడంతో నీటి ఇబ్బందులు మొదలయ్యాయి. ఆశాజనకంగా వరికి ధర పలుకుతున్నా నీటి కొరతతో సాగులేక నష్టపోవాల్సిన పరిస్థితి ఏర్పాడింది. ఎగువ ప్రాంతం నుంచి నీరు రాక, డ్యాంలో ఉన్న నీటినే అవసరాలకు వదులుతు న్నారు. డ్యాం పూర్తిసామర్థ్యం 77.988 టీఎంసీలు కాగా శుక్రవారం నాటికి 7.272 టీఎంసీల నీరు ఉంది. దిగువ డెల్టాకు 200, ఉత్తర, దక్షిణ కాలువలకు 10 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నట్లు అధికారులు ప్రకటించారు. నీటిమట్టం దిగ జారుతూ అప్పట్లో మునిగిన గట్లు నేడు బయట పడుతున్నా యి. డ్యాం ప్రధాన ముఖద్వారం వద్ద పర్యవేక్షణ కోసం సిబ్బంది ఎవరూ లేరు. నీరు లేదు.. సాగులేదు.. వరద రావడం లేదు. ఇక మాకేం పని అన్నట్లు అధికారుల వ్యవహ రశైలి ఇక్కడి పరిస్థితులకు అద్దం పడుతోంది.

\- అనంతసాగరం



డ్యాంలో నీరు తగ్గి ఎగువున బయటపడ్డ గట్లు



జిల్లా వాసుల దాహం తీర్చేందుకు వదిలిన జలాలు

వివాదంలో వీఎస్‌యూ!

- అధికారుల తీరుపై విమర్శల వెల్లువ
- పూర్తికాని భవనాలకు ప్రారంభోత్సవాలు
- విచ్చలవిడిగా శిలాఫలకాల ఏర్పాటు
- టీడీపీ నాయకుల అభ్యంతరం

వెంకటాచలం, జూన్ 7 : భవన నిర్మాణాలు పూర్తికాకనే రాత్రికి రాత్రే ప్రారంభోత్సవ శిలాఫలకాలు ఏర్పాటు చేయడంతో విక్రమ సింహపురి యూని వర్సిటీ (వీఎస్‌యూ) అధికారుల తీరు వివాదాస్పదంగా మారింది. కాకుటూరు వద్ద ఉన్న వీఎస్‌యూ ప్రాంగణంలో నిర్మాణ దశలో కొన్ని, రెండేళ్లలో నిర్మించిన భవనాలు ఉన్నాయి. అయితే, ఇటీవల జరిగిన వర్సిటీ స్నాతకోత్సవ వేడుకలకు చాన్సలర్ హోదాలో రాష్ట్ర గవర్నర్ అబ్దుల్ నజీర్ హాజరయ్యారు. కానీ ఆ సమయంలో పూర్తయిన భవనాలను ప్రారంభించలేదు. అయితే రాత్రికి రాత్రే హడావుడిగా భవనాలకు వివిధ తేదీల్లో ప్రారంభోత్స వాలు జరిగినట్లు శిలాఫలకాలు ప్రత్యక్షమయ్యాయి. ఈ వ్యవహారంతో అధికారుల తీరు వివాదాస్పదంగా మారింది.



పాత తేదీతో ఉన్న శిలాఫలకాన్ని చూపిస్తున్న టీడీపీ నేత రాజా యాదవ్

● కోడ్ అమలులో ఉన్నా..

కోడ్ అమలులో ఉన్నప్పుడు ఎలాంటి ప్రారంభోత్సవాలు చేయకూడదు. అయితే, మే 6వ తేదీన ఒక భవనాన్ని ఉపకులపతి సుందరవల్లి ప్రారంభించి, శిలాఫలకాన్ని ఆవిష్కరించినట్లు ఉంది. ఎన్నికల నియమావళిని సైతం పట్టించుకోకుండా శిలాఫలకం ఏర్పాటు చేయడం మరింత వివాదానికి దారి తీసింది. ఇక వర్సిటీ ప్రాంగణంలో ఉన్న భవనాలకు సైతం వైసీపీ రంగులు ఉన్నాయి. వీటిపై పలువురు ప్రశ్నిం చినా అధికారుల నుంచి ఎలాంటి సమాధానం రాలేదు. అంతేగాక గడిచిన ఐదేళ్లలో వర్సిటీ వేదికగా వైఎస్ఆర్ వర్ధంతి, జయంతి, వైసీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి జన్మదిన వేడుకలను వర్సిటీ అధికారులు నిర్వహించారు. దీనిని విద్యార్థి సంఘాలు అడ్డుకు న్నా అధికారుల తీరు మారలేదు. ఉపకులపతి సుందరవల్లి, రిజిస్ట్రార్ పాములూరు రామచంద్రారెడ్డి చుట్టే వివాదాలు నడిచాయంటేనే వర్సిటీ రాజకీయా లకు వేదికగా మారిందో లేదో తెలుస్తుంది. కాగా, ఉపకులపతి సుందరవల్లి వైసీపీ అధినేత జగన్‌మోహన్‌రెడ్డికి సమీప బంధువు కావడం విశేషం.

● విశ్వవిద్యాలయమా.. వైసీపీ కార్యాలయమా!?

విక్రమ సింహపురి విశ్వవిద్యాలయం కాస్త వైసీపీ ఐదేళ్ల పాలనలో ఆ పార్టీ శిక్షణ కార్యాలయంగా మారిపోయిందని టీడీపీ మండలాధ్యక్షుడు గుమ్మడి రాజా యాదవ్ విమర్శించారు. వీఎస్‌యూలో నిబంధనలకు విరుద్ధంగా రాత్రికి రాత్రే ప్రారంభోత్సవ శిలాఫలకాలను ఏర్పాటు చేశారని సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి దృష్టికి స్థానికులు తీసుకువెళ్లారు. దీంతో సోమిరెడ్డి సూచనల మేరకు శుక్రవారం టీడీపీ మండలాధ్యక్షుడు రాజాయాదవ్ ఆధ్వర్యంలో వీఎస్‌యూకు వెళ్లిన నాయకులు, కార్యకర్తలు శాంతియుతంగా శిలాఫలకాలను తొలగించారు. భవన నిర్మాణాలు పూర్తికాకనే ఎలా ప్రారంభోత్సవ శిలాఫలకాలు ఏర్పాటు చేస్తారని, కోడ్ అమలులో ఉండగా ఎలా సాధ్యమైందని, వర్సిటీలోని భవనా లకు వైసీపీ రంగులు ఉండటంపైనా అధికారులను నిలదీశారు. వారి ప్రశ్నలకు సమాధానం ఇవ్వలేక వర్సిటీ అధికారులు నీళ్లు నమిలారు. చివరకు పోలీ సులు టీడీపీ సర్దిచెప్పడంతో వారు వెనుతిరిగారు.



శిలాఫలకం ఏర్పాటుకు జరుగుతున్న పనులను అడ్డుకున్న నాయకులు

● గవర్నర్‌కు ఫిర్యాదు

వీఎస్‌యూలో రాత్రికి రాత్రే వివిధ తేదీల్లో ప్రారంభోత్సవ శిలాఫలకాలు ఏర్పాటు చేయడంపై రాష్ట్ర గవర్నర్ ఎస్ అబ్దుల్ నజీర్‌కు సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి ఫిర్యాదు చేశారు. రాష్ట్రంలో ఎన్డీఏ కూటమి అధికారంలోకి వచ్చిందని, భవన నిర్మాణాలు పూర్తయ్యాక ప్రారంభోత్సవాలు ఏర్పాటు చేసుకోవచ్చని, అంతా హడావిడిగా ఎందుకని ప్రశ్నించారు. దీనిపై గవర్నర్ వెంటనే స్పందించి వీసీపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

కుమార్తెను చూసేందుకు వస్తూ

తిరిగిరాని లోకానికి..

- రోడ్డు ప్రమాదంలో తండ్రి మృతి, తల్లి, చెల్లికి గాయాలు
- మరో ఐదుగురికి కూడా...



చికిత్స పొందుతున్న మృతుడి భార్య వెంకటలక్ష్మి



ప్రమాదంలో దెబ్బతిన్న బస్సు



చికిత్స పొందుతున్న బస్సు డ్రైవర్ కిషోర్‌బాబు



గాయపడిన మృతుడి కుమార్తె కోటేశ్వరి



చెన్నయ్య (ఫైల్)

కావలిరూరల్, జూన్ 7: కావలిలో ఉన్న కుమార్తెను చూసేందుకు బస్సులో బయలుదేరిన కుటుంబం మార్గమధ్యంలో రోడ్డు ప్రమాదానికి గురైంది. ఈ ఘటనలో తండ్రి దుర్మరణం చెందగా తల్లి, చెల్లికి తీవ్ర గాయాలయ్యాయి. వీరితో పాటు మరో ఐదుగురు గాయపడ్డారు. రూరల్ పోలీసుల కథనం మేరకు.. ప్రకాశం జిల్లా తర్లుపాడు మండలం సీతానాగులవరం గ్రామస్థుడు రజక సామాజిక వర్గానికి చెందిన తూంపాటి చెన్నయ్య(45) కుల వృత్తి చేసుకుంటూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. 9నెలల క్రితం తన పెద్ద కుమార్తె గౌరీలక్ష్మికి కావలి పాతూరుకు చెందిన కుమార్‌తో వివాహం జరిపించారు. ఆమెను చూసేందుకు గురువారం రాత్రి మార్కాపురం నుంచి చెన్నైకి వెళుతున్న గిద్దలూరు డిపోకు చెందిన ఏపీ 27 జెడ్ 0254 నెంబరు గల సూపర్ లగ్జరీ బస్సులో భార్య వెంకటలక్ష్మి, చిన్నకుమార్తె కోటేశ్వరి, మేనల్లుడు బాలకాశితో కలసి బయలుదేరారు. శుక్రవారం తెల్లవారుజామున 2 గంటల సమయంలో మార్గమధ్యంలోని కావలి మండలం రుద్రకోట వద్ద కోల్‌కత్తా-చెన్నై జాతీయ రహదారిపై ముందు వెళ్తున్న కంటైనర్ లారీ సడన్‌గా ఆగడంతో దాని వెనుక వేగంగా వెళుతున్న బస్సు కంటైనర్ లారీని ఢీకొంది. ఈ ప్రమాదంలో ముందు సీటులో కూర్చున్న చెన్నయ్య బస్సులో నుంచి కింద పడి తీవ్రగాయాలతో అక్కడికక్కడే మృతి చెందాడు. చెన్నయ్య భార్య వెంకటలక్ష్మి, కుమార్తె కోటేశ్వరి, బస్సు డ్రైవర్ పెద్దపల్లి కిషోర్ బాబుతోపాటు మరో నలుగురు ప్రయాణికులు గాయపడ్డారు. క్షతగాత్రులను చికిత్స నిమిత్తం హైవే అంబులెన్స్‌లో వైద్యశాలకు తరలించారు. డ్రైవర్ కిషోర్‌బాబుకు తీవ్రగాయాలు కావడంతో ప్రాథమిక చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం ఒంగోలుకు తరలించారు. మరో 10 నిమిషాల్లో కుమార్తె వద్దకు చేరుకుంటామనుకునే సమయంలో దుర్మరణం చెందిన చెన్నయ్య మృతదేహాన్ని చూసిన భార్య, కుమార్తె రోదనలు చూపరులను కంటతడి పెట్టించాయి. ఈ ప్రమాదం సమాచారం అందుకుని ఘటనా స్థలాన్ని పరిశీలించిన సీఐ కాటూరి శ్రీనివాసరావు చెన్నయ్య మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఏరియా వైద్యశాలకు తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

బుజబుజ నెల్లూరులో అగ్నిప్రమాదం

- 100 కేవీ ట్రాన్స్‌ఫార్మర్ దగ్ధం

నెల్లూరు (విద్య), జూన్ 7 : నెల్లూరు నగరంలోని బుజబుజనెల్లూరులో నివాస గృహాల మధ్య ఉండే 100కేవీ విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌లో శుక్రవారం తెల్లవారు జామున భారీ పేలుడుతో అగ్ని ప్రమాదం సంభవించింది. ట్రాన్స్‌ఫార్మర్ నుంచి పెద్దఎత్తున మంటలు ఎగిసిపడడంతో చుట్టపక్కల ప్రజలు భయాందోళనకు గురయ్యారు. వెంటనే విద్యుత్ సిబ్బందికి సమాచారం అందించి విద్యుత్ సరఫరాను పూర్తిగా నిలిపివేయడంతో ప్రమాదం తప్పింది. స్థానికులు అగ్నిమాపకశాఖ (ఫైర్)కు ఫోన్ చేయగా 'తాము అంత దూరం రాలేమని, వేరే మార్గాలు చూసుకోమని' ఫైర్ సిబ్బంది చెప్పడంతో ప్రజలకు ఏమి చేయాలో తోచలేదు. అరగంట తరువాత మంటలు అదుపులోకి రావడంతో ఊపిరి పీల్చుకున్నారు. ట్రాన్స్‌ఫార్మర్‌కు సమీపంలోనే ఓ కార్పొరేట్ కళాశాలతోపాటు హాస్టల్ కూడా నిర్వహిస్తుండటంతో ట్రాన్స్‌ఫార్మర్‌పై అధికలోడు పడుతుండడంతో నిత్యం ఆ ప్రాంతంలో విద్యుత్ సమస్యలు తలెత్తుతున్నాయనే ఆరోపణలున్నాయి. కాగా, అగ్నికి ఆహుతైన ట్రాన్స్‌ఫార్మర్ స్థానంలో శుక్రవారం మరొకటి ఏర్పాటు చేశారు. ఇందుకోసం ఉదయం నుంచి సాయంత్రం వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయడంతో స్థానికులు ఇబ్బంది పడ్డారు.



అగ్నికి ఆహుతవుతున్న విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్

పిడుగుపాటుకు యువకుడి మృతి

వరికుంటపాడు, జూన్ 7: యర్రంరెడ్డిపల్లి గ్రామానికి చెందిన నాదిండ్ల రవీంద్రబాబు (32) శుక్రవారం సాయంత్రం పశువుల మేత కోసం సమీపంలోని పొలంలోకి వెళ్లి గడ్డిని తీసుకొని ఇంటికి వస్తున్నాడు. ఈ సమయంలో ఉరుములు, మెరుపులతో కూడిన వర్షంలో ఒక్కసారిగా పిడుగు పడటంతో అతను అక్కడికక్కడే మృతిచెందాడు. సమీపంలో గడ్డి కోస్తూ ఉన్న తన తల్లి ఈ విషయాన్ని గమనించి కేకలు వేస్తూ అక్కడికి వెళ్లగా అతను అప్పటికే మృతిచెందాడని గుర్తించింది. మృతుడికి భార్య, ఓ కుమార్తె ఉంది. విషయం తెలుసుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని వివరాలు సేకరించారు.



రవీంద్రబాబు మృతదేహం

రైలు పట్టాలపై మృతదేహం

బిట్రగుంట, జూన్ 7: బిట్రగుంట రైల్వే సెక్షన్ పరిధిలోని కావలి, బిట్రగుంట రైల్వే స్టేషన్ల మధ్యలో 218/19-17 కిలో మీటర్ల వద్ద రైలు పట్టాల మధ్యలో సుమారు 45 ఏళ్ల గుర్తుతెలియని వ్యక్తి మృతదేహాన్ని గుర్తించినట్లు కావలి జీఆర్పీ ఎస్సై అరుణకుమారి శుక్రవారం రాత్రి తెలిపారు. మృతదేహం ఉన్న పరిస్థితిని బట్టి గుర్తు తెలియని రైల్లో నుంచి ప్రమాదవశాత్తు జారిపడి మృతి చెంది ఉండవచ్చన్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కావలి ఏరియా వైద్యశాలకు తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఆమె తెలిపారు.



మాట్లాడుతుండగానే కుప్పకూలిన బీజేపీ నేత

- గుండెపోటుతో బుజ్జిరెడ్డి మృతి

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట), జూన్ 7 : విజయోత్సవ సభలో మాట్లాడుతూ బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి కాలం బుజ్జిరెడ్డి గుండెపోటుతో మృతి చెందారు. సంగం ప్రాంతానికి చెందిన ఆయన బీజేపీలో క్రియాశీలకంగా పనిచేస్తున్నారు. తాజా ఎన్నికల్లో కేంద్రం, రాష్ట్రంలో ఎన్‌డీఏ కూటమి విజయం సాధించినందుకు శుక్రవారం బీజేపీ జిల్లా కార్యాలయంలో విజయోత్సవం నిర్వహించారు. ఇందులో పాల్గొన్న బుజ్జిరెడ్డి అనంతరం పార్టీ కార్యాలయంలో ఫేస్‌బుక్ లైవ్‌లో మాట్లాడుతుండగా గుండెపోటు రావడంతో కుప్పకూలిపోయారు. నాయకులు, కార్యకర్తలు హుటాహుటిన అపోలో ఆసుపత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు. సంగంలో శనివారం అంత్యక్రియలు జరగనున్నాయి.



కాలం బుజ్జిరెడ్డి

చికెన్ ధరలు

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్

	కిలో
బాయిలర్ లైవ్	162
లేయర్ లైవ్	120
స్కిన్ చికెన్	284
స్కిన్‌లెస్	314
లేయర్	204

బంగారం, వెండి ధరలు

బంగారం (22 క్యారెట్లు)

ఒక గ్రాము ధర	రూ.6887
వెండి కిలో ధర	రూ. 94,100
వెండి ఒక గ్రాము	రూ. 96.10

మెదడు గడ్డలు

మహా ప్రమాదం!

- కేన్సర్‌గా మారే అవకాశం
- రేడియేషన్, సెల్‌ఫోన్ల వల్ల ముప్పు
- చికిత్సను నిర్లక్ష్యం చేస్తే ప్రాణాపాయమే
- జిల్లాలో 1200 మందికిపైగా బాధితులు
- నేడు ప్రపంచ బ్రెయిన్ ట్యూమర్ నివారణ దినం

నెల్లూరు(వైద్యం), జూన్ 7 : మనిషి శరీరంలో మెదడుకు ఎంతటి ప్రాధాన్యత ఉందో దాన్ని వ్యాధుల నుంచి కాపడుకోవాల్సిన అవసరం అంతే ఉంది. అవయవాలను నియంత్రించే మెదడులో గడ్డలు (ట్యూమర్) ఏర్పడితే వెంటనే తగిన చికిత్స తీసుకోవాలి. లేకుంటే మెదడులో ఏ ప్రాంతంలో కణతి ఏర్పడితే సంబంధిత అవయవంపై అది తీవ్ర ప్రభావం చూపుతుంది. మెదడు గడ్డల్లో దాదాపు 120 రకాలు ఉంటాయి. వాటిలో అత్యంత ప్రమాదకరంగా భావించే గియో బ్లపోమా మల్టీఫార్మా(జీబీఎం) కణతులు ఏర్పడితే పరిస్థితి మరింత తీవ్రంగా ఉంటుందని వైద్య నిపుణులు చెబుతున్నారు. ప్రతి పదివేల మందిలో నలుగురు ఈ వ్యాధికి గురవుతుండగా 2025కల్లా వెయ్యి మందిలో పది మంది వ్యాధికి గురైయ్యే అవకాశం ఉందని నిపుణుల అంచనా. వాతావరణంలో పెరిగిన రేడియేషన్, మితిమీరిన సెల్‌ఫోన్ల వాడమే ఈ వ్యాధి పెరగడానికి కారణంగా చెబుతున్నారు. మారుమూల పల్లెల్లో సైతం సెల్‌ఫోన్ టవర్ల సంఖ్య పెరిగిపోవటంతో పరిస్థితి ప్రమాదకరంగా మారుతోందని హెచ్చరిస్తున్నారు.




జిల్లాలో ఆందోళనకర పరిస్థితి

బ్రెయిన్ ట్యూమర్ బాధితులు జిల్లాలో 1200 మందికిపైగా బాధితులు ఉన్నట్లు గణాంకాలు చెబుతున్నాయి. ఈ సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉందని వైద్యులు అంటున్నారు. మొబైల్ ఫోన్ ఎక్కువగా వాడే వారిలో గ్లయోమా తరహాలో మెదడులో గడ్డలు వచ్చేందుకు అవకాశం ఉన్నట్లు ఇటీవలి పరిశోధనల్లో వెల్లడైంది. అందుకే సెల్‌ఫోన్ వాడకం తగ్గించాలని నిపుణులు సూచిస్తున్నారు. మెదడు గడ్డలను నిర్లక్ష్యం చేస్తే అవి కేన్సర్ గడ్డలుగా మారి ప్రాణాంతకమయ్యే ప్రమాదం ఉందని హెచ్చరిస్తున్నారు. మేనరికపు వివాహాలకు దూరంగా ఉండాలని, కుటుంబంలో ఎవరికైనా బ్రెయిన్ ట్యూమర్ ఉంటే కుటుంబ సభ్యులందరూ వైద్య పరీక్షలు చేయించుకోవాలని సూచిస్తున్నారు.

ఆధునిక వైద్య చికిత్సలు

బ్రెయిడ్ ట్యూమర్లకు ప్రస్తుతం ఎన్నో ఆధునిక వైద్య చికిత్సలు అందుబాటులోకి వచ్చాయి. ఆధునిక రేడియోథెరపీకి గామానైఫ్ థెరపీ, సైబర్‌నైఫ్ థెరపీ వంటి ప్రక్రియల ద్వారా చికిత్సలు అందించే విధానాలు ఉన్నాయి. టార్గెట్ థెరపీ కూడా చేస్తున్నాము.

- డాక్టర్ సంపత్‌కుమార్, న్యూరోఫిజిషియన్, నారాయణ సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి





ఆందోళన వద్దు

మెదడులోని ట్యూమర్లపై ఆందోళన అవసరం లేదు. వైద్య చికిత్సలతో వ్యాధిని నయం చేయవచ్చు. ఎంతటి క్లిష్టమైన శస్త్ర చికిత్సలైనా విజయవంతం చేయవచ్చు. మేనరికాలకు దూరంగా ఉండటం మంచిది. అవసరమైతే తప్ప సెల్‌ఫోన్ వాడకపోవడం మంచిది.

- డాక్టర్ రమణమూర్తి, న్యూరోసర్జన్, అపోలో ఆసుపత్రి

జీజీహెచ్ అభివృద్ధి కమిటీ కో ఆర్డినేటర్ గదికి తాళాలు

నెల్లూరు(వైద్యం), జూన్ 7 : ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో ఉన్న అభివృద్ధి కమిటీ కో ఆర్డినేటర్ లక్ష్మీసునంద కార్యాలయానికి తాళాలు వేశారు. శుక్రవారం అధికారులు లక్ష్మీసునంద చాంబర్‌ను స్వాధీనం చేసుకున్నారు. వైసీపీ అధికారంలో ఉండగా ఏర్పడిన అభివృద్ధి కమిటీకి ప్రత్యేక కార్యాలయంతోపాటు అన్ని సౌకర్యాలు కల్పించారు. కమిటీ కాలపరిమితి ముగిసినా ప్రభుత్వ అండదండలతో ఇప్పటి వరకు జీజీహెచ్‌లో కమిటీ కొనసాగింది. ప్రభుత్వం మారి టీడీపీ అధికారంలోకి రావటంతో ఆ చాంబర్‌ను జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ సిద్దానాయక్ స్వాధీనం చేసుకున్నారు.

వారం గడిచినా వేదనే!

- జీతాలందక టీచర్ల అవస్థలు

నెల్లూరు (హరనాథపురం), జూన్ 7 : నెల ఆరంభమై వారం రోజులు గడిచినా వేతనాలు అంతకపోవడంతో ఉపాధ్యాయులు అవస్థలు పడుతున్నారు. జిల్లాలో 16 వేల మందికి పైబడి టీచర్లు ఉండగా, ప్రతినెలా సుమారు రూ. 130 కోట్ల వరకు జీతాలు చెల్లించాల్సి ఉంది. జీతాలకు సంబంధించి బిల్లులను గత నెల ఆఖరులోనే అప్‌లోడ్ చేశారు. అయితే జూన్ 7వ తేదీ గడిచిపోయినా ఇప్పటికీ వారి బ్యాంకు ఖాతాలో వేతనాల సొమ్ము జమకాలేదు. తమ జీతాల సొమ్మును కాంట్రాక్టర్ల బిల్లుల చెల్లింపులకు వాడేశారని ఉపాధ్యాయులు ఆరోపిస్తున్నారు. ప్రతి నెల ఖర్చులతోపాటు జూన్ నెలలో పిల్లల స్కూల్ ఫీజులు, పుస్తకాలు, యూనిఫాం వంటి కొనుగోళ్లు ఉంటాయి. అయితే, జీతాలు ఆలస్యం కావడంతో అప్పులు చేయాల్సి వస్తోందని టీచర్లు వాపోతున్నారు.

తాగునీటిలో కలుషిత వ్యర్థాలు

- పలువురికి అనారోగ్యం

అనంతసాగరం, జూన్ 7: స్థానిక గుంత బజారులో కలుషితబావి నీరు తాగి శుక్రవారం కొందరు వాంతులు, విరోచనాలతో పీహెచ్‌సీలో చేరారు. వీరికి వైద్య సిబ్బంది పరీక్షలు నిర్వహించి అనారోగ్యానికి కారణాలను ఆరాతీశారు. ఆ ప్రాంతంలోని బావినీరు తాగడంతో ఈపరిస్థితి ఏర్పడినట్లు గుర్తించి నీటి పరీక్షలు చేయించారు. కలుషిత వ్యర్థాలు వున్నట్లు గుర్తించి కోర్లినేషన్ చేసి కొంత కాలం పాటు బావినీరు వాడవద్దని స్థానికులకు సూచించారు. కార్యక్రమంలో వైద్యాధికారి శ్రీకాంత్‌రెడ్డి, హెల్త్‌అసిస్టెంట్లు ప్రసాద్, అబ్దుల్‌ఖాదర్, కార్యదర్శి మోహన్‌కిషోర్, సచివాల ఇంజనీరింగ్ అసిస్టెంట్ ప్రీతి, ఆశావర్కర్లు పాల్గొన్నారు.



బావినీటిని పరీక్షిస్తున్న వైద్య సిబ్బంది

ప్రతినెలా బియ్యం, చక్కెరతో సరి..!



ఎండీయూ వాహనం వద్ద లబ్ధిదారులకు బియ్యం, చక్కెర పంపిణీ

- 11 నెలలుగా అందని కందిపప్పు
- అరకొర కేటాయింపులతో డీడీలు కట్టని డీలర్లు
- అస్తవ్యస్తంగా రేషన్ సరుకుల పంపిణీ
- ప్రైవేట్ మార్కెట్‌లో ధరలు రెండింతలపైనే..
- కొనుగోలు చేయలేని స్థితిలో నిరుపేదలు

సంగం, జూన్ 7: వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక కార్డుదారులకు సకాలంలో సరుకులు అందక అల్లాడుతున్నారు. విధిలేని పరిస్థితుల్లో నిరుపేదలు బహిరంగ మార్కెట్‌లో అధిక ధరలకు కొనుగోలు చేయాల్సి వస్తోంది. జిల్లాలో ఏదో మొక్కుబడిగా రేషన్ పంపిణీ చేస్తుండగా ప్రధానమైన కందిపప్పు మాత్రం ఇవ్వడం మానేశారు. గతేడాది నుంచి కందిపప్పు పంపిణీని పూర్తిగా నిలిపివేశారు.

జిల్లాలో 7.22లక్షల రేషన్‌కార్డులున్నాయి. అందుకు ప్రతినెలా 10,923 మెట్రిక్ టన్నుల బియ్యం, 361 మెట్రిక్ టన్నుల చక్కెర, 722 మెట్రిక్ టన్నుల కందిపప్పు పంపిణీ చేయాల్సి ఉంది. ఆ మేరకు కేటాయింపులు చేయాల్సిన ప్రభుత్వం కేవలం బియ్యం మాత్ర మే కేటాయించి చేతులు దులుపుకుం టోంది. పంచాదార కొంతమేర తక్కువగా వస్తున్నా కొన్ని ప్రాంతా ల్లో ఇస్తూ మరికొన్ని ప్రాంతాల్లో మరుసటి నెలలో ఇస్తూ నెట్టుకొస్తున్నారు. ఇక కందిపప్పు అనేది జిల్లాకు కేటాయించడం లేదు. ఒక్కో కార్డుదారుడికి కిలో కందిపప్పును రాయితీపై రూ.67లకు ఇవ్వాల్సి ఉంది. బహిరంగ మార్కెట్లో మొదటి రకం కందిపప్పు ప్రస్తుతం కిలో రూ.170 నుంచి 180లు, రెండోరకం రూ.160లు పలుకుతోంది. ఇంత మొత్తం పెట్టి కొనుగోలు చేయడం పేదలకు భారంగా ఉంది.

ఏడాదిగా కందిపప్పు కేటాయింపులు లేవు..

జిల్లాకు అవసరమైన మేర కందిపప్పును ఏడాదిగా ప్రభుత్వం కేటాయించడం లేదు. కందిపప్పును సరఫరా చేసే సంస్థలకు ప్రభుత్వం బిల్లులు చెల్లించకపోవడంతో అవి నిలిపివేసినట్లు సమాచారం. నెలకు 722మెట్రిక్ టన్నుల కందిపప్పు అవసరం ఉండగా ఈ పది నెలల కాలంలో జిల్లాకు నెలకు కేవలం 100 నుం చి 120 మెట్రిక్ టన్నులు మాత్రమే కేటాయించారు. రేషన్ పంపిణీ సమయంలో కొంత మందికి ఇచ్చి మిగతా వారికి ఇవ్వకపోతే తమపై నిందారోపణలు వస్తాయన్న భావనతో డీలర్లు, ఎండీయూ వాహనదారులు అరకొరగా కందిపప్పును తీసుకునేందుకు ముందుకు రాలేదు. అలా గత పది నెలల నుంచి దాటవేత ధోరణితో నెట్టుకొస్తున్నారు.

ఈ నెలలో కూడా అదే పరిస్థితి..

జూన్ 1వ తేదీ నుంచి రేషన్ పంపిణీ జరుగుతోంది. ఈ నెలలో కూడా కందిపప్పు అరకొరగా కేటాయించడంతో కందిపప్పుకు డీలర్లు డీడీలు చెల్లించలేదు. వైసీపీ ప్రభుత్వం కార్డుదారులకు గోధుమ పిండిని కూడా పంపిణీ చేస్తామని ఆర్భాటంగా ప్రకటించినా పూర్తిస్థాయిలో ఇవ్వలేకపోయింది.

కొత్త ప్రభుత్వంపైనే ఆశలు..

ప్రస్తుతం జరిగిన ఎన్నికల్లో వైసీపీ ఓడిపోయి టీడీపీ కూటమి అధికారంలోకి వచ్చింది. ఈ నెల 12న మంచి మూహూర్తం రోజు నారా చంద్రబాబునాయుడు సీఎంగా ప్రమాణ స్వీకారం చేయనున్నారు. ఆ తరువాత కొత్త ప్రభుత్వంలో జూలైలో అయినా కందిపప్పు పంపిణీ చేస్తారని పేదలు ఆశగా ఎదురుచూస్తున్నారు.

మా సమస్యలు పరిష్కరించండి

నెల్లూరు (సాంస్కృతికం) జూన్ 7 : ఎన్నికల్లో టీడీపీ కూటమి విజయంతో ప్రభుత్వ విశ్రాంత ఉద్యోగులకు మరో స్వాతంత్ర్యం లభించిందని ఆ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు ఎస్ఎం గౌస్, వైస్ ప్రెసిడెంట్ ఎస్‌కే ఖాసిం అన్నారు. వారు శుక్రవారం నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డిని కలిసి అభినందనలు తెలిపారు. పుష్పమాలలు, శాలువాలతో సత్కరించారు. పెన్షనర్స్ సమస్యలను ఐదేళ్లుగా పట్టించుకోలేదని, కూటమి ప్రభుత్వంలోనైనా వాటికి మోక్షం కల్పించాలని విజ్ఞప్తి చేశారు.

188 పొగాకు బేళ్లు తిరస్కరణ

కలిగిరి, జూన్ 7: స్థానిక పొగాకు వేలం కేంద్రానికి శుక్రవారం రైతులు మొత్తం 1035 పొగాకు బేళ్లు విక్రయానికి తీసుకొచ్చారు. వేలంలో 16 కంపెనీల ప్రతినిధులు పాల్గొని 847 బేళ్లు కొనుగోలు చేశారు. నోబిడ్-66, ఆర్ఆర్-7, సీఆర్-45, జంపింగ్ లాట్స్-70 కారణాలతో 188 బేళ్లు తిరస్కరించారు. కిలో పొగాకు గరిష్ఠ ధర రూ.331, కనిష్ఠ ధర రూ.205, సగటు ధర రూ.281.93గా నమోదైనట్లు వేలం నిర్వహణాధికారి మహేష్‌కుమార్ తెలిపారు.

ఆక్రమించుకో.. నిర్మించుకో..!

- రూపుకోల్పోతున్న కనుపర్తిపాడు, గొలగమూడి కాలువలు
- కాలువలు మూసేసి యథేచ్ఛగా నిర్మాణాలు
- రోడ్డు పోరంబోకునూ వదలని అక్రమార్కులు
- దొంగ రిజిస్ట్రేషన్లు కూడా చేసుకున్న వైనం

నెల్లూరు, జూన్ 7 (ఆంధ్రజ్యోతి) : ఖాళీ స్థలం కనిపిస్తే చాలు.. అది ప్రభుత్వానిదా?, రోడ్డా.. కాలువా? అన్న సంబంధం లేకుండా కొందరు అక్రమార్కులు రెచ్చిపోతున్నారు. దర్జాగా వీటిని కబ్జా చేసి కట్టడాలు నిర్మిస్తున్నారు. ఇప్పటికే నెల్లూరు నగరంలో అనేక కాలువలు ఆక్రమణకు గురై రూపు కోల్పోయాయి. చాలా వరకు కాలువలు కుదించుకుపోవడంతో వర్షాకాలంలో ఆ నీరు నగరం నుంచి బయటకు వెళ్లేందుకు అవకాశం లేక రోడ్డుమీద పారుతోంది. ఓ మోస్తరు వర్షం కురిసినా నెల్లూరు నగరం మునిగిపోతుండడానికి ప్రధాన కారణం ఈ కాలువల ఆక్రమణే అని గతంలోనే నిపుణులు తేల్చారు. అయినప్పటికీ అధికార యంత్రాంగం జాగ్రత్తలు తీసుకోలేకపో తోంది. తాజాగా నెల్లూరు సిటీ నుంచి నీటిని బయటకు తీసుకెళ్లే కనుపర్తిపాడు కాలువ, గొలగమూడి కాలువలు ఆక్రమణకు గురవుతున్నాయి. కొన్ని నెలలుగా ఈ కాలువలను యథేచ్ఛగా ఆక్రమించేస్తున్నారు. కొండాయపాళెం నుంచి జాతీయ రహదారిపైనున్న గొలగమూడి క్రాస్ రోడ్డు వరకు రోడ్డుకు ఇరువైపులా ఆక్రమణలు కొనసాగుతున్నాయి. అక్కడి కాలువలపై ప్రస్తుతం అనేక కాంక్రీటు నిర్మాణాలు వెలుస్తు న్నాయి.

పొంతనలేని విస్తీర్ణం

రోడ్డుకు ఒక వైపు గొలగమూడి కాలువ, మరోవైపు కనుపర్తిపాడు కాలువ వెళుతున్నాయి. వీటి అసలు విస్తీర్ణానికి, ప్రస్తుతం కనిపిస్తున్న విస్తీర్ణానికి అసలు పొంతన కనిపించడం లేదు. ఏదో మురికి కాలువల్లాగా చిన్నవిగా మారిపోయాయి. ఈ ప్రాంతంలో నగరం వేగంగా విస్తరిస్తోంది. పెద్ద పెద్ద భవనాలు వెలుస్తున్నాయి. రానున్న రోజుల్లో ఈ ఆక్రమణల ప్రభావం నగర ప్రజలపై తీవ్రంగా పడనుంది. ఇప్పటికే కొందరు అక్రమార్కులు కాలువలు, రోడ్డు పోరంబోకును ఏకంగా రిజిస్ట్రేషన్ కూడా చేసేసుకున్నట్లు తెలుస్తోంది. అసలు రిజిస్ట్రేషన్ శాఖ ఈ భూములను ఎలా రిజిస్ట్రేషన్ చేస్తోందన్న ప్రశ్న తలెత్తుతోంది. రోడ్డు మార్జిన్లు ఆక్రమించి నిర్మాణాలు చేశారంటూ గతంలో కార్పొరేషన్ అధికారులు ఆ నిర్మాణాలను తొలగించారు. అయితే ఆ తర్వాత అదే రోడ్డు మార్జిన్, పక్కనే ఉన్న కాలువ పోరంబోకు స్థలానికి కలిపి పొజిషన్ సర్టిఫికెట్ జారీ చేయడం గమనార్హం. వీటిపై కొందరు 'స్పందన'లో ఫిర్యాదు చేసినా అధికారులు పట్టించుకోలేదని ఆరోపిస్తున్నారు. అక్రమార్కుల్లో కొందరు కాలువల్లో పిల్లర్లు వేసి నిర్మాణాలు జరుపుతున్నారు. ఇంకొందరు కాలువల డిశ్చార్జి లెవల్స్‌కు సంబంధం లేకుండా పైపులు వేయడం, కల్వర్టర్లు నిర్మించడం చేస్తున్నారు. వీటిని ఇరిగేషన్ అధికారులు ఎలా అనుమతిస్తున్నారన్న ప్రశ్న తలెత్తుతోంది. పడారుపల్లి చెరువు నుంచి ఒక పెద్ద కాలువ కనుపర్తిపాడు వైపు వెళుతుండగా దానిని ఆక్రమించి అడ్డంగా ఓ గోడౌన్ నిర్మించారు. దీని పక్కనే మరో గెస్ట్‌హౌస్ కూడా నిర్మించారు. జాతీయ రహదారి జంక్షన్‌లో ఏకంగా పెద్ద పెద్ద నిర్మాణాలు చేసి బాడుగలకు ఇస్తున్నారు. నగరంలోకి ప్రవేశించే మార్గాలలో గొలగమూడి రోడ్డు కూడా ప్రధానమైనది. నగరం అభివృద్ధి చెందుతున్న నేపథ్యంలో భవిష్యత్‌లో ఈ రోడ్డును నాలుగు వరుసలుగా విస్తరించాల్సిన పరిస్థితి ఏర్పడుతుంది. అప్పుడు ఆక్రమణల తొలగింపు చాలా కష్టమయ్యే అవకాశం ఉంది. ఇంత దర్జాగా కాలువలను పూడ్చేస్తున్నా అటు ఇరిగేషన్ శాఖ గానీ, ఇటు కార్పొరేషన్ అధికారులు గానీ తమకేమీ పట్టదన్నట్లు వ్యవహరిస్తుండడం విమర్శలకు తావిస్తోంది. ఎవరో పది, ఇరవై మంది ఆక్రమణదారుల మూలంగా భవిష్యత్‌లో కొన్ని లక్షల మంది జనాభా ఇబ్బందులు పడాల్సి వస్తుందని గ్రహించి తగిన చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.



కాలువను పూడ్చేసి చదును చేసిన ప్రాంతం



గొలగమూడి కాలువలో చేపట్టిన నిర్మాణం

బ'స్టాండింగ్'

- బస్‌షెల్టర్లు లేక ప్రయాణికుల ఇక్కట్లు
- రోడ్లపైనే నిరీక్షిస్తున్న వైనం
- నియోజకవర్గంలోని అన్ని మండలాల్లో ఇదే దుస్థితి



ఉదయగిరి ప్రధాన సెంటర్‌లో బస్‌షెల్టర్ లేక ఎండలో నిల్చున్న ప్రయాణికులు

ఉదయగిరి, జూన్ 7: నియోజవకర్గకేంద్రంతో పాటు దుత్తలూరు, వరికుంటపాడు మండల కేం ద్రాల్లో బస్‌షెల్టర్లు ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. శుభకార్యాలు, ఇతర పనులకు బంధుమిత్రులతో కలిసి వెళ్లే వారు బస్సుల కోసం ప్రధాన రోడ్డులో నిరీక్షించాల్సిన దుస్థితి నెలకొన్నది. ఈ గ్రామాల్లో బస్ షెల్టర్లు నిర్మించాలని పలు మా ర్లు స్థానికులు ఆందోళన చేస్తూ అధికారుల దృష్టికి తీసుకెళ్లినా వారు పట్టించుకోవడం లేదని గ్రామ స్థులు వాపోతున్నారు. పవిత్ర పుణ్యక్షేత్రమైన నర్రవాడకు ప్రతి ఆదివారం వందల సంఖ్యలో భక్తులు వస్తుంటారు. అలాగే ప్రతిఏటా జరిగే ఉత్సవాల్లో పాల్గొనేందుకు 4నుంచి 5లక్షల వరకు భక్తులు తరలివస్తారు. అలాంటి ప్రాంతాల్లోనే ఆర్టీసీ అధికా రులు ఎలాంటి ఏర్పాట్లు చేయలేదని చెబుతున్నారు. సీతారామపురం నుంచి పోరుమామిళ్ల, బద్వేల్, సీఎస్ పురం వెళ్లే మార్గాల్లో బస్‌షెల్టర్లు లేక ప్రయాణికులు రోడ్డుపై వేచి ఉండాల్సి వస్తుంది. దుత్తలూరు సెంటర్‌లో బస్‌షెల్టర్ లేక ప్రయాణికులు దుకాణాల ముందు వేచి చూడాల్సిన పరిస్థితి నెలకొంది. ఇప్పటికైనా అధికారులు బస్‌షెల్టర్లు ఏర్పాటు చేయాలని ప్రజలు కోరుతున్నారు.



బస్‌షెల్టర్ లేని దుత్తలూరు ప్రధాన రోడ్డు సెంటర్

ఉపాధి క్షేత్ర సహాయకుడి సస్పెన్షన్

- ఎన్నికల ఫలితాల అనంతరం చర్యలు

కలువాయి, జూన్ 7: చిన్నగోపవరం ఉపాధిహామీ పథకం క్షేత్రసహాయకుడు ఆదిరెడ్డి మహేంద్రరెడ్డిని ఉన్నతాధికారులు తాత్కాలికంగా విధుల నుంచి తొలగించారు. ఈ మేరకు మండల కార్యాలయానికి శుక్రవారం ఉత్తర్వులు అందాయి. గ్రామానికి చెందిన ఎస్సీ, ఎస్టీ, ఇతర కుటుంబాలకు చెందిన ఉపాధి జాబ్‌కార్డులతో పెద్ద ఎత్తున ఇతర ప్రాంతాలకు చెందిన వారి పేర్లు చేర్పించి వారంతా ఉపాధి పనులకు వెళుతున్నట్లు బోగస్ మస్టర్లు చేసుకుని నిధులు స్వాహా చేశారు. ఈ అవినీతి వ్యవహారంపై అందిన ఫిర్యాదు మేరకు మార్చి 27వతేదీ ఉపాధిహామీ పథకం అంబూడ్స్‌మెన్ వెంకటరెడ్డి గ్రామానికి వచ్చి విచారణ జరిపారు. ఈ విషయమై ఏప్రిల్ 1వ తేదీ ఆంధ్రజ్యోతి దినపత్రికలో భారీగా ఉపాధి సొమ్ము దోపిడి శీర్షికన వార్త ప్రచురితమైంది. దీనిపై ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు గుట్టు చప్పుడు కాకుండా ఎస్సీ, ఎస్టీ జాబ్‌కార్డులలో చేర్పించిన ఇతర ప్రాంతాలకు చెందిన పేర్లు తొలగించారు. అవినీతిపై ఎలాంటి చర్యలు తీసుకోలేదు. రెండునెలలు అనంతరం రాజకీయ పరిస్థితులు మారిపోవడంతో ఎట్టకేలకు ఈ చర్యలు తీసుకున్నారని గ్రామస్థులు చర్చించుకుంటున్నారు.

సంగంలో మలేరియా వ్యతిరేక మాసోత్సవ ర్యాలీ



ర్యాలీలో పాల్గొన్న వైద్యులు, సిబ్బంది

సంగం, జూన్ 7: ప్రపంచ మలేరియా దినోత్సవాన్ని పురస్కరించుకుని స్థానిక ప్రాథమిక ఆస్పత్రి వైద్యాధికారి ఆధ్వర్యంలో శుక్రవారం మలేరియా వ్యతిరేక మాసోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్య సిబ్బంది ఆస్పత్రి నుంచి బస్టాండ్‌సెంటర్ వరకు ర్యాలీ నిర్వహించారు. అనంతరం వైద్యుడు అశోక్ మాట్లాడారు. ఇళ్ల వద్ద ఉన్న మురుగు కాలువల్లో నీరు నిల్వ ఉండడకుండా చర్యలు తీసుకోవాలని, దోమలు నిల్వ ఉండకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. వర్షాకాలంలో దోమల కాటుకు గురికాకుండా దోమతెరలను వినియోగించాలని సూచించారు. కార్యక్రమంలో సబ్ యూనిట్ అధికారి ఖాదర్‌బాష, ఎంపీహెచ్‌ఈవో కొండయ్య, హెచ్‌ఈ ఆరోగ్య మేరీ, హెల్త్ సూపర్‌వైజర్ జలీల్ అహ్మద్, ఏఎన్ఎంలు పాల్గొన్నారు.

నాణ్యమైన విద్యనందిస్తాం



తల్లిదండ్రులకు అవగాహన కల్పిస్తున్న ప్రభుత్వ పాఠశాల ఉపాధ్యాయులు

ఉదయగిరి రూరల్, జూన్ 7: మా ప్రభుత్వ పాఠశాలలో విలువలతో కూడిన నాణ్యమైన విద్యనందిస్తాం.. విద్యార్థులకు మధ్యాహ్న భోజనం, యూనిఫాం, పుస్తకాలు ఉచితంగా అందజేస్తాం.. మీ పిల్లలను మా బడిలో చేర్పండంటూ శుక్రవారం దాసరిపల్లి ప్రాథమికోన్నత పాఠశాల ఉపాధ్యాయులు ఇంటింటా ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయురాలు సాబిరాబేగం, ఉపాధ్యాయులు విద్య, వసతులపై తల్లిదండ్రులకు అవగాహన కల్పించి విద్యార్థులను అడ్మిషన్స్ చేయించుకున్నారు.

వెంగమాంబ సన్నిధిలో వేలం



టెండర్ల బాక్సును పరిశీలిస్తున్న ఈవో ఉషశ్రీ

దుత్తలూరు(ఉదయగిరి రూరల్), జూన్ 7: నర్రవాడ వెంగమాంబ పేరంటాలమ్మ ఆలయ ఆవరణలో శుక్రవారం ఈ నెల 23 నుంచి 27వ తేదీ వరకు జరగనున్న బ్రహ్మోత్సవాలకు సంబంధించి వివిధ అంశాలపై బహిరంగ వేలం, టెండర్లు నిర్వహించారు. ఆలయ కార్యనిర్వాహణాధికారి ఉషశ్రీ ఆధ్వర్యంలో కోవూరు గ్రూపు దేవస్థానాల కార్యనిర్వాహణాధికారి సీహెచ్ కృష్ణప్రసాద్ పర్యవేక్షణలో ఈ కార్యక్రమం చేపట్టారు. ఆయా అంశాల్లో తక్కువ కోడ్ చేసిన వారు టెండర్లు దక్కించుకొన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ ఇలారి నాగయ్య, ఆలయ ఉపప్రధాన అర్చకులు బెల్లంకొండ పెద్దభద్రయ్య, ఆలయ సిబ్బంది, గ్రామస్థులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

ఉదయగిరి రూరల్, జూన్ 7: పట్టణంలో శనివారం ఉదయం 8నుంచి మధ్యాహ్నం 12.30గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని ట్రాన్స్‌కో ఏఈ ఖుద్దూస్‌బాషా శుక్రవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. కొత్త ట్రాన్స్‌పార్మర్ల ఏర్పాటు, చెట్ల తొలగింపు పనుల్లో భాగంగా ఈ చర్యలు తీసుకోనున్నట్లు వినియోగదారులు సహకరించాలని కోరారు.

లోకేష్‌ను కలిసిన చెంచలబాబు



లోకేష్‌కు పుష్పగుచ్ఛం అందజేస్తున్న చెంచలబాబు

ఉదయగిరి రూరల్, జూన్ 7: టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్‌ను శుక్రవారం గుంటూరు జిల్లా ఉండవల్లిలో టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి, మాజీ జెడ్పీ చైర్మన్ పొన్నెబోయిన చెంచలబాబుయాదవ్ మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. ఐదేళ్లుగా పార్టీ కోసం కష్టపడిన వారిని గుర్తించుకొంటామని, చంద్రబాబు ముఖ్యమంత్రిగా ప్రమాణస్వీకారం చేసిన అనంతరం అన్నివిధాలా సహకరిస్తామని లోకేష్ తెలిపినట్లు చెంచలబాబు తెలిపారు.

నీట్‌లో అగ్రహారం విద్యార్థిని సత్తా



మానస్వితను అభినందిస్తున్న ఉపాధ్యాయులు

అనంతసాగరం, జూన్ 7: బొమ్మవరం పంచాయతీలోని అగ్రహారంకు చెందిన అక్కలరెడ్డి భాస్కర్‌రెడ్డి, ఉష దంపతుల కుమార్తె మానస్విత నీట్ పరీక్ష ఫలితాల్లో సత్తా చాటింది. బెంగుళూరు శ్రీచైతన్య విద్యాసంస్థలో ఇంటర్ రెండో సంవత్సరం చదువుతూ నీట్‌కు తర్ఫీదు పొందింది. 720మార్కుల్లో 700మార్కులు సాధించి ఆల్‌ఇండియా పరిధిలో 1689ర్యాంకు సాధించింది. భవిష్యత్తులో డాక్టరై పేదకు ఉచిత వైద్యసేవలు అందిస్తానని విద్యార్థిని తెలిపారు. తల్లిదండ్రులు, అధ్యాపకులు మానస్వితను అభినందించారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



ఉపాధ్యాయులతో పూర్వ విద్యార్థులు

సీతారామపురం, జూన్ 7: స్థానిక జెడ్పీహెచ్ పాఠశాలలో 1996-97 నుండి 2000-2001వ సంవత్సరం 6తరగతి నుంచి 10వతరగతి) వరకు చదివిన విద్యార్థులు శుక్రవారం ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఈ సందర్భంగా మధుర స్మృతులు, జ్ఞాపకాలను గుర్తుకు తెచ్చుకుని సంతోషంగా గడిపారు. విద్యాబుద్ధులు నేర్పిన గురువులను శాలువాల, పూలమాలలతో సన్మానించి మెమొంటోలను అందజేశారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు షఫీ అహ్మద్, సుధాకర్, మారుతి,ఉపాధ్యాయులు వెంకటరెడ్డి, శ్యాంబాబు, అల్లూరు రాజు, మజ్జారు చెన్నరాయుడు, ఏనుగుల మాలతి, నారాయణ, కిరణ్, వెంకటపతి పాల్గొన్నారు.

ముగిసిన గ్రంథాలయ వేసవి విజ్ఞాన శిబిరం



బహుమతులతో సంగంలో విద్యార్థులు

సంగం, జూన్ 7: స్థానిక గ్రంథాలయంలోని వేసవి విజ్ఞాన శిబిరం శుక్రవారం ముగిసింది. విద్యార్థులు ఇళ్ల వద్ద ఖాళీగా తిరగకుండా గ్రంథాలయాలకు వచ్చే అలవాటు చేయడంతో పాటు సృజనాత్మకత, విజ్ఞానం పెరుగుతుందని లైబ్రియన్ రవీంద్రనాథ్‌రెడ్డి తెలిపారు. గత నెల 15నుంచి వేసవి విజ్ఞాన శిబిరాలు ఏర్పాటు చేసి విద్యార్థులకు కథలు చెప్పడం, రాయడం, స్పోకన్ ఇంగ్లీషు అంశాలపై అవగాహన కల్పించామన్నారు. అలాగే విద్యార్థులకు చిత్రలేఖన, వ్యాసరచన, క్విజ్, క్రీడా పోటీలు నిర్వహించి గెలుపొందిన వారికి బహుమతులు అందజేశామన్నారు.



ఉదయగిరిలో బహుమతులు అందజేత

ఉదయగిరి: స్థానిక గ్రంథాల య శాఖ కార్యాలయంలో వేసవిశి క్షణ తరగతులు ముగిశాయి. గ్రంథాలయ శాఖ అధికారి ఫజులుల్లా విద్యార్థులకు చిత్రలేఖనం, రాయడం, చదవడం, బొమ్మలు గీయడం, ఆటల పోటీలు నిర్వహించి ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచిన విద్యార్థులు బహుమతులు అందజేశారు.

టీడీపీ నాయకుల సంబరాలు



విజయోత్సవ వేడుకల్లో టీడీపీ నాయకులు

ఆత్మకూరు, జూన్ 7 : పట్టణంలో మున్సిపల్ కౌన్సిలర్ సూరా భాస్కర్‌రెడ్డి ఆధ్వర్యంలో శుక్రవారం టీడీపీ శ్రేణులు కేక్ కట్ చేసి అభిమానులకు పంచిపెట్టారు. కార్యక్రమంలో ఏఎంసీ మాజీ చైర్మన్ ఇందూరు రమణారెడ్డి, రాష్ట్ర కార్యదర్శి దావా పెంచలరావు, సొసైటీ మాజీ చైర్మన్ చిట్టమూరి వెంకటేశ్వర్లురెడ్డి, నలిశెట్టి శ్రీనివాసులు, తోఏటి వెంకటయ్య పాల్గొన్నారు.

ఉదయగిరిలో మోస్తరు వర్షం

ఉదయగిరి రూరల్, జూన్ 7: మండలంలో శుక్రవారం ఓ మోస్తారు వర్షం కురిసింది. గండిపాళెంలో ఉరుములు, మెరుపులు, ఈదురుగాలులతో కూడిన వర్షం కురిసింది. గాలులకు గ్రామంలోని విద్యుత్ స్తంభం విరిగి ఓ ఇంటిపై పడింది.

సంగం: మండలకేంద్రంలో శుక్రవారం సాయంత్రం తేలికపాటి వర్షం కురిసింది.



గండిపాళెంలో ఇంటిపై పడ్డ విద్యుత్ స్తంభం

కావలి
కందుకూరు, ఆత్మకూరు, ఉదయగిరి

ఎట్టకేలకు నీటి సరఫరా

- అధికారుల హెచ్చరికతో దిగివచ్చిన వైసీపీ నేతలు
- నెలాఖరు వరకు కొనసాగింపునకు సుముఖత

కావలి, జూన్ 7: కావలి మున్సిపాలిటీలో అర్థాంతరంగా నిలిపి వేసిన తాగునీటి సరఫరా పునరుద్ధరించకుంటే చర్యలు తప్పవని మున్సిపల్ అధికారులు హెచ్చరించడంతో బినామీ పేర్లతో ట్యాంకర్లను ఏర్పాటు చేసి నీటిని తోలుతున్న వైసీపీ నేతలు దిగివచ్చారు. ఈ నెలాఖరు వరకు నీటిసరఫరా కొనసాగించేందుకు సుముఖత వ్యక్తం చేశారు. కావలి పట్టణంలో నీటిని సరఫరా చేస్తున్న ట్యాంకర్లను అకస్మాత్తుగా నిలిపివేయడంతో పట్టణ ప్రజలకు తాగునీటి ఇబ్బందులు ఎదురయ్యాయి. ఈ విషయాన్ని స్థానికులు కావలి ఎమ్మెల్యే కావ్య క్రిష్ణారెడ్డి దృష్టికి తీసుకెళ్లడంతో ఆయన మున్సిపల్ అధికారులతో చర్చించారు. ఇప్పటి వరకు నీరు తోలి అకస్మాత్తుగా ట్యాంకర్లు ఎలా నిలిపివేస్తారని ప్రశ్నించారు. దానిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. దీంతో మున్సిపల్ అధికారులు నీటిసరఫరా చేసే బినామీ కాంట్రాక్టర్లు అయిన వైసీపీ నేతలతో చర్చించి నీటి సరఫరా నిలిపివేస్తే చట్టపరంగా వచ్చే ఇబ్బందులను వివరించడంతో ఎట్టకేలకు శుక్రవారం నుంచి నీటి సరఫరా పునరుద్ధరించారు. కొత్త కాంట్రాక్టర్ వచ్చే వరకు నీటి సరఫరా కొనసాగించాలని అధికారులు చెప్పగా ఈ నెలాఖరు వరకు నీటి ట్యాంకర్లు కొనసాగిస్తామని వారు చెప్పినట్లు తెలుస్తోంది. అయితే అప్పట్లోగా అధికారులు నీటి సరఫరాపై ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయకపోతే మళ్లీ ఇబ్బందులు ఎదురయ్యే పరిస్థితి ఉంది.



మంచి నీరు పరఫరా చేస్తున్న టీడీపీ నేతలు

- **కావ్య ట్రస్ట్ ద్వారా నీటి సరఫరా**

కావలిలో అకస్మాత్తుగా నీటి సరఫరా ఆపివేయడంతో పట్టణంలోని గిరిజన కాలనీలు, ఇతర స్లమ్ ఏరియాలలో ప్రజలు తాగునీటికి ఇబ్బందులు పడ్డారు. దీంతో ఎమ్మెల్యే క్రిష్ణారెడ్డి తన కావ్య ట్రస్ట్ ద్వారా అలాంటి ప్రాంతాలకు సొంత ట్యాంకర్ల ద్వారా ఉచితంగా నీటి సరఫరా చేయించారు.

ఇంటూరికి అధికారులు, నేతల శుభాకాంక్షలు



కందుకూరు :ఇంటూరిని అభినందిస్తున్న ఎమ్మెల్సీ



వలేటివారిపాలెం : తిలకం దిద్దుతున్న మహిళ

కందుకూరు, జూన్ 7 : కందుకూరు ఎమ్మెల్యేగా ఎన్నికైన ఇంటూరి నాగేశ్వరరావుని శుక్రవారం వివిధ శాఖల అధికారులు, నేతలు కలిసి శుభాకాంక్షలు తెలిపారు. కందుకూరు సబ్ డివిజన్‌లోని పోలీస్ అధికారులు డీఎస్పీ శ్రీనివాస్ ఆధ్వర్యంలో బడేవారిపాలెంలోని నాగేశ్వరరావు నివాసానికి వెళ్లి ఆయనకు పూల బోకేలు అందించి శుభాకాంక్షలు తెలిపారు. అలాగే పంచాయతీరాజ్, ఇరిగేషన్, ఆర్‌డబ్ల్యూఎస్ తదితర ఇంజనీరింగ్ శాఖల అధికారులు కూడా నాగేశ్వరరావుని కలిసి శాలువాలుతో సత్కరించారు. కందుకూరు ఏరియా ఆసుపత్రి డాక్టర్ల బృందం శుభాకాంక్షలు తెలిపారు. పలు ఉపాధ్యాయ సంఘాల నాయకులు, ఉపాధ్యాయలు, వివిధ సంఘాల వారు నాగేశ్వరరావుని కలిసేందుకు పోటీ పడడంతో కోలాహలం నెలకొంది.

- కందుకూరు ఎమ్మెల్యేగా ఘన విజయం సాధించిన ఇంటూరి నాగేశ్వరరావును స్థానిక టీడీపీ కార్యాలయంలో తూర్పు రాయలసీమ పట్టభద్రుల ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్ కలిసి శుభాకాంక్షలు తెలిపారు. నాగేశ్వరరావును శాలువాతో సత్కరించి పూల బొకే అందించారు.

వలేటివారిపాలెం : మండలంలోని లింగపాలెంకు శుక్రవారం వచ్చిన కందుకూరు ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావుకు గ్రామస్థులు ఘన స్వాగతం పలికారు. మేళతాళాలు, మంగళ వాయిద్యాలతో ఊరేగింపు నిర్వహించారు. మహిళలు అడుగుడునా నాగేశ్వరావుపై పూలవర్షం కురిపించారు. నుదుట తిలకం దిద్ది గుమ్మడికాయలతో దిష్టి తీసి హారతులు పట్టారు. అనంతరం ఆయన కేక్ కట్ చేసి కార్యకర్తలతో కలిసి ఒకరినొకరు తినిపించుకున్నారు. అలాగే వలేటివారిపాలెంనకు చెందిన పలువురు టీడీపీ శ్రేణులు మండలంలోని బడేవారిపాలెంలో నాగేశ్వరరావు ఇంటికి వెళ్లి శాలువాతో సత్కరించి పూలబొకే అందజేసి అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమాల్లో టీడీపీ మండల అధ్యక్షుడు మాదాల లక్ష్మీనరసింహం, నాయకులు గొర్రెపాటి మాధవరావు, వడ్లమూడి శ్రీనివాసులు, కాకుమాను ఆంజనేయులు, వలేటి నరసింహం, పరిటాల భాస్కర్‌రావు, వలేటి మధుసూదన్‌రావు, కాకుమాను హర్షకుమార్, కొంకా రమేష్, కాకుమాను మాల్యాద్రి, కాకుమాను హర్ష, కూరపాటి మాధవరావు, గుత్తా మహేశ్వరరావు, కాకుమాను మల్యాద్రి, కొంకా రమేష్, తదితరులు పాల్గొన్నారు.

కొత్తపేటలో...

గుడ్లూరు : కందుకూరు ఎమ్మెల్యేగా ఎన్నికైన ఇంటూరి నాగేశ్వరరావు మొదటిసారిగా మండలంలోని కొత్తపేటకు రావడంతో స్థానిక టీడీపీ శ్రేణులు ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా గ్రామంలోని కొత్తపేట గంగమ్మ ఆలయం వరకు ఊరేగింపు నిర్వహించి సంబరాలు జరుపుకున్నారు. గంగమ్మ ఆలయంలో మొక్కులు చెల్లించి నైవేద్యాలు సమర్పించారు. మండల నాయకులు ఇంటూరికి అభినందనలు తెలిపారు. అనంతరం ఇంటూరి మాట్లాడుతూ రాష్ట్రంలో అరాచకపాలన నుంచి విముక్తి లభించిందన్నారు. రానున్న కాలంలో ప్రతి ఒక్కరు సుఖసంతోషాలతో ఉండేలా పాలన సాగుతుందని తెలిపారు. తన గెలుపునకు కృషి చేసిన ప్రతి కార్యకర్తకు రుణపడి ఉంటానన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు జనిగర్ల నాగరాజు, నాయకులు మూలేపాటి సుబ్బానాయుడు, జాజుల కొండయ్య, అమ్మనబ్రోలు గంగయ్య, శింగమనేని పద్మ, తాటిపర్తి రామకృష్ణ, పొదిలి వెంకటేశ్వర్లు, బంకా విష్ణు తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే కావ్యకు అభినందనల వెల్లువ



ఎమ్మెల్యే కావ్యను అభినందిస్తున్న మాలేపాటి



ఎమ్మెల్యేకు పుష్పగుచ్ఛం అందిస్తున్న అధికారులు

కావలి, జూన్ 7: కావలి ఎమ్మెల్యేగా గెలుపొందిన దగుమాటి వెంకట(కావ్య) క్రిష్ణారెడ్డిని శుక్రవారం ముసునూరులోని ఆయన నివాసంలో వివిధ శాఖల అధికారులు కలిసి అభినందనలు తెలిపారు. గురువారం ఎన్నికల కోడ్‌ను తొలగించడంతో శుక్రవారం ఎమ్మెల్యేను కలిసి శుభాకాంక్షలు తెలిపేందుకు వివిధ శాఖల అధికారులు, సిబ్బంది ఎమ్మెల్యే ఇంటి వద్ద బారు లు తీరారు. ఆయనకు పుష్పగుచ్ఛం అందచేసి అభినందనలు తెలిపారు. ఎమ్మెల్యేను కలిసిన వారిలో కావలి ఆర్డీవో శీనానాయక్, తెలంగాణ విద్యుత్ శాఖ సీఈ నందకుమార్, స్థానిక అధికారులు, మున్సిపల్ కమిషనర్ జీ.శ్రావణ్‌కుమార్, సిబ్బంది, ఇరిగేషన్, వ్యవసాయశాఖల అధికారులు, సిబ్బంది, ఎస్‌బీఐ ఉద్యోగులు తదితరులు ఉన్నారు.

ఎమ్మెల్యేకు శుభాకాంక్షలు తెలిపిన మాలేపాటి

కావలి ఎమ్మెల్యే కావ్య క్రిష్ణారెడ్డిని టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు మాలేపాటి సుబ్బానాయుడు తన అనుచరులతో కలిసి వచ్చి ఎమ్మెల్యేను సత్కరించి అభినందనలు తెలిపారు. అలాగే పలువురు టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు, కార్యకర్తలు కలిసి అభినందనలు తెలిపారు.

హామీల అమలుకు కృషి చేస్తే సహకరిస్తాం

- వైసీపీ ఎమ్మెల్సీ తూమాటి మాధవరావు

కందుకూరు, జూన్ 7 : ప్రజలు మార్పును కోరుకొని తెలుగుదేశం పార్టీకి ఘనం విజయం చేకూర్చుతూ ఇచ్చిన తీర్పుని స్వీకరిస్తున్నామని, నియోజకవర్గంలో ఎమ్మెల్యేగా ఎన్నికైన ఇంటూరి నాగేశ్వరరావు ప్రజలకు ఇచ్చిన హామీలకు కృషి చేస్తే నిర్మాణాత్మక ప్రతిపక్షంగా తోడ్పాటు అందిస్తామని వైసీపీ ఎమ్మెల్సీ తూమాటి మాధవరావు పేర్కొన్నారు. శుక్రవారం ఆయన కందుకూరులో విలేకర్లతో మాట్లాడుతూ కక్షలు, వేధింపులకు పాల్పడితే మాత్రం తీవ్రంగా ప్రతిఘటిస్తామని, వైసీపీ కార్యకర్తలకు ఏ కష్టం వచ్చినా అందుబాటులో ఉంటామని తెలిపారు. కందుకూరు నియోజకవర్గాన్ని ప్రకాశం జిల్లాలో చేరుస్తామని టీడీపీ నాయకులు ఇచ్చిన హామీని విశ్వసించి అనేకమంది ఓట్లు వేశారని, ఆ హామీ అమలుకు తక్షణం చర్యలు చేపట్టాలని సూచించారు. కందుకూరు నియోజకవర్గానికి పెద్ద ఎత్తున పరిశ్రలు తీసుకొస్తాన్న హామీని కూడా అమలు చేసేందుకు కృషి చేయాలన్నారు.

నైతిక విలువలుంటే రాజకీయ సన్యాసం చేయాలి

చిత్రగుంట, జూన్ 7: సార్వత్రిక ఎన్నికల సమయంలో వైసీపీ మండల నేతలు చేసిన సవాళ్ల మేరకు వారికి నైతిక విలువలు ఉంటే రాజకీయ సన్యాసం చేయాలని టీడీపీ మండల కన్వీనర్ మాలేపాటి నాగేశ్వరావు, నేతలు కోడూరు వేంకటేశ్వర్లురెడ్డి, రావి విజయ్ కుమార్ యాదవ్ అన్నారు. బోగోలు మండల టీడీపీ కార్యాలయంలో శుక్రవారం జరిగిన విలేకర్ల సమావేశంలో వారు మాట్లాడుతు ఎన్నికల సమయంలో వైసీపీ నేతలు కళ్ల నెత్తికెక్కి మండలంలోని పదహారు పంచాయతీల్లో ఏ ఒక్క పంచాయతీలోనైనా ఒక్క ఓటు టీడీపీకి మెజార్టీ వస్తే వైసీపీకి రాజీనామ చేసి రాజకీయ సన్యాసం తీసుకుంటామని చేసిన సవాళ్లు ఏమయ్యాయని ప్రశ్నించారు. వైసీపీకి ప్రజలు తగిన బుద్ధి చెప్పారని, రాజకీయాల్లో ఎవరికీ అధికారం శాశ్వతం కాదని తెలుసుకోవాలని వారు హితవు పలికారు. ఈ కార్యక్రమంలో నాయకులు కాండ్ర రఘురాం నాయుడు, యన్నాబత్తిన వేంకటేశ్వర్లు, యర్రం వెంకటేశ్వర్లురెడ్డి, పుట్టా సుబ్బారావు, బోగిరి ప్రభాకర్, ఆదిశేషయ్య, సుధీర్ తదితరులు పాల్గొన్నారు.

మాలకొండకు టీడీపీ కార్యకర్తల పాదయాత్ర



మాలకొండకు పాదయాత్ర నిర్వహిస్తున్న బోడిపాటివారికొష్టాల టీడీపీ శ్రేణులు

వలేటివారిపాలెం/కందుకూరు, జూన్ 7 : కందుకూరు మండలం కొండకందుకూరు పంచాయతీలోని బోడిపాటివారి కొష్టాలకు చెందిన సుమారు 30 మంది టీడీపీ కార్యకర్తలు మండలంలోని మాలకొండ లక్ష్మీనరసింహస్వామి దేవాలయాని కి శుక్రవారం పాదయాత్ర చేపట్టారు. ఎమ్మెల్యేగా ఇంటూరి నాగేశ్వరరావు విజయం సాధిస్తే మాలకొండకు పాదయాత్రగా వస్తామని మొక్కుకున్నట్లు వారు తెలిపారు. మాల్యాద్రి లక్ష్మీనరసింహ స్వామిని దర్శించుకొని కొబ్బరికాలు కొట్టి పూజలు చేశారు. కందుకూరు టీడీపీ కార్యాలయం వద్ద ఇంటూరి నాగేశ్వరరావును కలిసి అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కందుకూరు మండల టీడీపీ అధ్యక్షుడు నార్నే రోశయ్య, నియోజకవర్గ బీజేపీ ఇన్‌చార్జి ఉన్నం భాస్కర్, నాయకులు ఈదర అరుణ, రెబ్బవరపు మాల్యాద్రి, చెంచురామయ్య, బోడపాటి సుధాకర్, సుబ్బారావు, మహేంద్ర, రామకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

అరాచక పాలనకు ముగింపు పలకడంలో జనసేన కీలకపాత్ర

లింగసముద్రం, జూన్ 7 : సార్వత్రిక ఎన్నికల్లో రాష్ట్రంలోని అరాచక పాలనకు ముగింపు పలకడంలో జనసేన పార్టీ కీలకపాత్ర పోషించిందని ఆ పార్టీ మండల అధ్యక్షుడు అంగుళూరి నరసింహారావు శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ ఎన్నికల్లో వైసీపీని ఎదుర్కొనేందుకు మూడు పార్టీల కూటమి కోసం జనసేన పార్టీ అధినేత పవన్‌కళ్యాణ్ ఎంతో కృషి చేశారని పేర్కొన్నారు. 2019 ఎన్నికల్లో జనసేన ఓడిపోయినప్పటికీ పార్టీ అధ్యక్షుడు పార్టీ బలోపేతానికి కృషి చేసి నిరంతరం నాయకులకు అందుబాటులో ఉన్నారని తెలిపారు.దేశంలో ఏ రాజకీయ పార్టీకి సాధ్యపడని విధంగా నూటికి నూరు శాతం పలితాలు సాధించిన ఘనత జనసేన పార్టీకి దక్కుతుందని పేర్కొన్నారు. కందుకూరు ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు గెలుపు కోసం మండలంలో జన సైనికులు ఎంతో కృషి చేశారని తెలిపారు. ఎమ్మెల్యే నాగేశ్వరరావుకు శుభాకాంక్షలు తెలిపారు.

ఆదర్శ పాఠశాలలో ఖాళీ సీట్ల భర్తీకి దరఖాస్తుల ఆహ్వానం

కొండాపురం, జూన్ 7: ఆదర్శ పాఠశాలలో ఖాళీ సీట్ల భర్తీకి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ ఖాదర్ బాషా శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. 2024-25 విద్యా సంవత్సరానికి సంబంధించి 6, 7, 8, 9 తరగతులలో సీట్లు ఉన్నాయని పేర్కొన్నారు. పాఠశాలల్లో ప్రవేశం పొందాలనుకునే విద్యార్థులు ఆధార్, ఫొటో, ధ్రువీకరణ పత్రాలతో ఈనెల 12వ తేదీలోగా పాఠశాల కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవచ్చని పేర్కొన్నారు. మండల పరిధిలోని విద్యార్థినీ, విద్యార్థులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని తెలిపారు.

ఎంపీ వేమిరెడ్డికి చేవూరి అభినందన



ఎంపీ వేమిరెడ్డిని అభినందిస్తున్న టీడీపీ నేత చేవూరి జనార్దన్‌రెడ్డి

జలదంకి, జూన్ 7: నెల్లూరు ఎంపీగా విజయం సాధించిన వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డిని అమరావతిలో శుక్రవారం ఉదయం మండల టీడీపీ నేత చేవూరి జనార్దన్‌రెడ్డి కలసి అభినందించారు. ఈ సందర్భంగా వేమిరెడ్డి కేంద్ర మంత్రి పదవి పొందాలని ఆకాంక్షించారు.

పేదలకు ఆహార పొట్లాల పంపిణీ

కావలిటౌన్, జూన్ 7: కావ్య కృష్ణారెడ్డి ఎమ్మెల్యేగా గెలుపొందిన సందర్భంగా 9వ వార్డు టీడీపీ మైనార్టీ నాయకులు మన్సూర్, ఎస్‌కే రఫీల ఆధ్వర్యంలో రైల్వే రోడ్డులోని జామియా మసీదులో శుక్రవారం పేదలకు ఆహార పొట్లాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో జామియా మసీదు మేనేజింగ్ కమిటీ పూర్వ అధ్యక్షుడు ఎస్‌కే రియాజ్, టీడీపీ పట్టణ మైనార్టీ సెల్ అధ్యక్షుడు రహీం, హజరత్, ఖమర్‌బాబు, సంధాని తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ, జనసేన శ్రేణుల సంబరాలు

లింగసముద్రం, జూన్ 7 : కందుకూరు ఎమ్మెల్యేగా ఇంటూరి నాగేశ్వరరావు గెలుపొందడంతో లింగసముద్రంలో శుక్రవారం రాత్రి టీడీపీ, జనసేన కార్యకర్తలు, నాయకులు సంబరాలు జరుపుకున్నారు. మండల తెలుగు యువత అధ్యక్షుడు అడపా రంగయ్య, ఉపాధ్యక్షుడు అడపా నర్సయ్య, నాయకులు కిలారి రమణయ్య, ఎస్ మహేష్, విష్ణు, యశ్వంత్ తదితరులు బాణాసంచా కాల్చుతూ, డీజే సౌండ్‌లతో గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ, జనసేన నాయకులు రాఖీ, గోపి, రవీంద్ర, బొజ్జా సాయి, నవీన్ తదితరులు పాల్గొన్నారు.

పునాదులు దాటని ప్రభుత్వ భవనాల నిర్మాణం

● వైసీపీ పాలనలో అటకెక్కిన అభివృద్ధి



చెర్లోపల్లిలో పునాదులు దాటని విలేజ్ క్లినిక్ నిర్మాణం

మనుబోలు, జూన్ 7: వైసీపీ పాలనలో గ్రామాల్లో అభివృద్ధి పనులు ఎక్కడికక్కడే ఆగిపోయాయి. సంక్షేమంతో పాటు గ్రామాల్లో పలు భవనాలు నిర్మించి అభివృద్ధి చేస్తున్నామంటూ వైసీపీ ప్రభుత్వం చెబుతూ వచ్చింది. అయితే ఐదేళ్లలో ఒక్క వ్యవస్థకు సంబంధించిన భవన నిర్మాణాలను పూర్తిస్థాయిలో నిర్మించలేదు. అంతేగాకుండా కొన్ని శాఖలకు సంబంధించిన భవన నిర్మాణాలకు కనీసం పునాదులు వేయనేలేదు. రెండువేలకు పైగా జనాభా ఉన్న పంచాయతీల్లో సచివాలయాలు నిర్మించి పక్కనే ఆర్‌బీకేలు, విలేజ్ క్లినిక్‌లు, మిల్క్‌బల్క్ సెంటర్‌లు, ఒక్కో పంచాయతీకి ఒక్కో డిజిటల్ లైబ్రరీలు నిర్మించాలని ప్రభుత్వం ఉద్దేశ్యం. మండలంలో 19 పంచాయతీలు ఉన్నాయి. వీటి జనాభా ఆధారంగా 14 సచివాలయాలుగా చేశారు. అయితే ఏడుచోట్ల మాత్రమే సచివాలయాల భవనాలు నిర్మించారు. అలాగే రైతుభరోసా కేంద్రాలు 14 నిర్మించాల్సి ఉండగా 6 మాత్రమే పూర్తిచేశారు. ఇక విలేజ్ క్లినిక్‌లు 13 నిర్మించాల్సి ఉండగా కేవలం మడమనూరు, అక్కంపేటలో మాత్రమే నిర్మాణాలు చేశారు. కొన్ని గ్రామాల్లో పునాదుల్లోనే ఆగిపోగా, మరికొన్ని గ్రామాల్లో అసలు ఎలాంటి నిర్మాణాలకు నోచుకోలేదు. అలాగే డిజిటల్ లైబ్రరీలు 19 పంచాయతీల్లో 19 మంజూరు కాగా ఒక్కచోట కూడా నిర్మాణానికి పూనుకోలేదు. మిల్క్‌బల్క్ సెంటర్‌లు 14 నిర్మించాల్సి ఉండగా ఎటువంటి పురోగతి లేదు. కాగా, ఈ భవనాల నిర్మాణాలకు ప్రభుత్వం నుంచి బిల్లులు సక్రమంగా రాకపోవడంతో భవనాలు నిర్మించేందుకు కాంట్రాక్టర్లు ముందుకు రాలేదని తెలుస్తోంది. అలాగే ఆయా గ్రామాల్లో సర్పంచులు సైతం ఈ నిర్మాణాలపై ఆసక్తి చూపకపోవడం, నిర్మాణాలు చేస్తే బిల్లులు రాక, గతంలో టీడీపీ నాయకులు బిల్లుల కోసం కోర్టుల చుట్టూ తిరిగినట్లు తాము తిరగాల్సి వస్తోందేమోనని వెనక్కుతగ్గినట్లు అవగతమవుతోంది. కాగా, కొత్తగా ఏర్పడే ప్రభుత్వం ఆగిన ఈ నిర్మాణాలన్నింటిని కొనసాగించి ముందుకు తీసుకెళుతుందా, ఇంకేదైనా కొత్త వ్యవస్థలకు ఇప్పుడు నిర్మాణాల్లో ఆగిన భవనాలను వినియోగిస్తుందా వేచిచూడాలి.

నెల్లూరు సిటీ, రూరల్
కోవూరు, సర్వేపల్లి

- టీడీపీ హయాంలో శ్రీకారం
- ఐదేళ్లుగా పట్టించుకోని వైసీపీ ప్రభుత్వం
- మళ్లీ కూటమి రాకతో అభివృద్ధికి అవకాశం



నెక్లెస్ రోడ్డుపై ఆశలు

నెల్లూరు (జడ్పీ), జూన్ 7: ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీ విజయంతో నగరంలోని నెక్లెస్‌రోడ్డు పూర్తికి మళ్లీ ఆశలు చిగురిస్తున్నాయి. గతంలో టీడీపీ ప్రభుత్వంలో నెల్లూరు నగరానికి తలమానికంగా స్వర్ణాల చెరువు గట్టున నెక్లెస్ రోడ్డును నిర్మించారు. దీనిని పర్యాటక ప్రదేశంగా తీర్చిదిద్దే ఉద్దేశంతో అప్పటి మంత్రి నారాయణ ప్రతిష్టాత్మకంగా పనులు చేపట్టారు. అమృత్ పథకం నిధులు రూ.30కోట్లతో బారాషాహీద్ దర్గా ప్రాంతం నుంచి ఇరుకళల పరమేశ్వరి దేవాలయం అవతల వరకు చెరువుగట్టును హైదరాబాద్‌లోని ట్యాంకు బండ్ తరహాలో అభివృద్ధి చేసేలా శ్రీకారం చుట్టారు. రోడ్డు వెంబడి జాతీయ, రాష్ట్ర నేతల విగ్రహాలు, వాకింగ్ ట్రాక్, పార్కులు, ఫుడ్‌కోర్టులు, విద్యుద్దీపాలు, స్వర్ణాల చెరువులో ఘాట్లు వంటి వాటికి పునాదులు పడ్డాయి. చెరువు కట్టపై సిమెంట్ రోడ్డు, పలువురు నేతల విగ్రహాలు, ప్రధాన ద్వారం ఆర్చి, ఘాట్లు వంటివి దాదాపు రూ.11కోట్లతో పూర్తిచేశారు. ఆ సమయంలో 2019 సార్వత్రిక ఎన్నికలు రావడం, ఆ తర్వాత రాష్ట్రంలో ప్రభుత్వం మారడంతో నెక్లెస్ రోడ్డు పనులు నిలిచిపోయాయి. వైసీపీ ప్రభుత్వం ఐదేళ్ల పాలనలో ఈ పర్యాటక ప్రాంతాన్ని పట్టించుకోలేదు. పనుల పూర్తికి నాటి, నేటి ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి ప్రయత్నించినప్పటికీ నిధుల లేమితో అడుగు ముందుకు పడలేదు. దీనికితోడు నిర్వహణ లేక అప్పటి వరకు చేసిన పనులు కూడా దెబ్బతిన్నాయి. సిమెంటు రోడ్డు బీటలు వారి ఒకవైపును కుంగిపోయింది. ఘాట్ మెట్లపై బండలు ఊడిపోయాయి. అయితే ఇటీవల ముగిసిన సార్వత్రిక ఎన్నికల్లో మరోసారి తెలుగుదేశం పార్టీ కూటమి విజయం సాధించడంతో నెక్లెస్‌రోడ్డుకు మహర్దశ రానున్నదని నగర ప్రజలు ఆశిస్తున్నారు. మాజీ మంత్రి నారాయణ నెల్లూరు సిటీ ఎమ్మెల్యేగా, రూరల్ ఎమ్మెల్యేగా కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి భారీ మెజారిటీతో గెలుపొందడంతో వారు నెక్లెస్ రోడ్డు పూర్తికి ప్రత్యేక కృషి చేసే అవకాశం ఉంది.

సోమిరెడ్డి గెలుపుతో తిరుమలకు పాదయాత్ర



మనుబోలు నుంచి తిరుమలకు వెళుతున్న దళిత యువకులు

మనుబోలు, జూన్ 7: సార్వత్రిక ఎన్నికల్లో సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి ఎమ్మెల్యేగా గెలుపొందడంతో స్థానిక అంబేడ్కర్ నగర్ నుంచి పలువురు దళిత యువకులు శుక్ర వారం పాదయాత్రగా తిరుమలకు వెళ్లారు. 16వేల ఓట్లకు పైగా మెజారిటీతో సోమిరెడ్డి విజయం సాధించడంతో మొక్కు తీర్చుకునేందుకు దళిత యువకులు టీడీపీ రైతు సం ఘం రాష్ట్ర నాయకుడు రాయపాటి కిరణ్‌కుమార్ ఆధ్వర్యంలో కాలినడకన మనుబోలు అంబేడ్కర్ విగ్రహం వద్ద నుంచి తిరుమలకు బయలుదేరారు. తిరుపతి పార్లమెంట్ తెలుగు యువత ప్రధాన కార్యదర్శి పచ్చిపాల రామిరెడ్డి జెండా ఊపి పాదయాత్ర ప్రా రంభించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు చేరెడ్డి పద్మనాభరెడ్డి, పుట్టామస్తాన్, వేమూరు వెంకటకృష్ణారెడ్డి, పాడి శివయ్య తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యలపై తక్షణం స్పందిస్తాం

పొదలకూరు, జూన్ 7: టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు మాజీ మంత్రి సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి విజయం కోసం ఆహర్నిశలు శ్రమించిన పొదలకూరు మండల మహిళా ఓటర్లు, పట్టణ మండల ప్రజలకు పొదలకూరు టీడీపీ మహిళా అధ్యక్షురాలు ఆదాల సుగుణమ్మ కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సోమిరెడ్డిని ఆదరించిన ప్రతి ఓటరుకు ధన్యవాదాలు, అభినందనలు తెలిపారు. పొదలకూరు పట్టణ, మండల ప్రజలకు ఎల్లవేళలా అందుబాటులో ఉండి ప్రజా సమస్యలపై తక్షణమే స్పందిస్తామన్నారు.

కెనరా బ్యాంకు మేనేజర్‌కు సన్మానం

తోటపల్లిగూడూరు, జూన్ 7: మండలంలోని కోడూరు కెనరా బ్యాంకు మేనేజరు ఉప్పుటూరి రవితేజ బదిలీ అయిన సందర్భంగా శుక్రవారం బ్యాంకు సిబ్బంది, ఖాతాదారులు ఆయనను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా మేనేజరు మాట్లాడుతూ అతి తక్కువ కాలంలో బ్యాంకు డిపాజిట్లు పెంచడంతోపాటు రికవరీలు చేయడం, విద్యాపరంగా కొత్త రుణాలు మంజూరు చేయడం జరిగిందన్నారు. బ్యాంకు సిబ్బంది సహకారం మరువలేనిదని అన్నారు. ఈ కార్యక్రమంలో భైనబోయిన సుధాకర్, బత్తల వెంకటరమణయ్య, అసిస్టెంట్ మేనేజర్ భరత్, తదితరులు పాల్గొన్నారు.

పచ్చని చెట్లు ప్రగతికి సోపానాలు

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట), జూన్ 7: పచ్చని చెట్లు ప్రగతికి సోపానాలని, ప్రతి ఒక్కరు మొక్కలు నాటి వాటిని సంరక్షించాలని రవాణా శాఖ ఉప కమిషనర్ చందర్ పిలుపునిచ్చారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవ మాసం సందర్భంగా నగరంలోని డీటీసీ కార్యాలయ ఆవరణలో శుక్రవారం అధికారులు మొక్కలు నాటారు. ఇన్‌చార్జి ఆర్టీవో మురళీ మోహన్, మోటార్ వాహనాల తనిఖీ అధికారులు బాలమురళీకృష్ణ, షేక్ బాబు, కార్తీక్ పవన్ కుమార్, రాంబాబు, గోపీ నాయక్, సహాయ మోటార్ వాహనాల తనిఖీ అధికారులు పాల్గొన్నారు.

అజీజ్‌కు మదనపల్లి ఎమ్మెల్యే సత్కారం

నెల్లూరు(వైద్యం), జూన్ 7: తెలుగుదేశం పార్టీ నెల్లూరు పార్లమెంటు నియోజకవర్గ అధ్యక్షుడు అబ్దుల్ అజీజ్‌ను అన్నమయ్య జిల్లా మదనపల్లి నియోజకవర్గ ఎమ్మెల్యే షేక్ షాజ హాన్ మర్యాదపూర్వకంగా కలిశారు. శుక్రవారం నెల్లూరుకు వచ్చిన షాజహాన్, అజీజ్‌ను ఆయన నివాసంలో కలిసి సత్కరించారు.



న్యూఢిల్లీలోని పార్లమెంట్ భవన్ వద్ద శుక్రవారం బీజేపీ అగ్రనేత అమిత్ షాను కలిసిన నెల్లూరు నగర డిప్యూటీ మేయర్ రూప్‌కుమార్ యాదవ్

చంద్రబాబు, లోకేష్‌ను కలిసిన నేతలు



చంద్రబాబును కలిసిన ఎమ్మెల్యే కురుగొండ్ల



తనయుడితో కలిసి లోకేష్‌ను కలిసిన సోమిరెడ్డి

రాపూరు(డక్కిలి)/ వెంకటాచలం : తెలుగుదేశం పార్టీ అగ్రనేతలు నారా చంద్రబాబు నాయుడు, నారా లోకేష్‌లను శుక్రవారం సర్వేపల్లి, వెంకటగిరి ఎమ్మెల్యేలు సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి, కురుగొండ్ల రామకృష్ణ వేర్వేరుగా కలిశారు. వీరితోపాటు సోమిరెడ్డి తనయుడు రాజగోపాల్‌రెడ్డి కూడా ఉన్నారు. ఉండవల్లిలోని చంద్రబాబు నివాసంలో కలిసిన వారు పుష్పగుచ్ఛం అందజేసి, శుభాకాంక్షలు తెలిపారు.

కామాక్షితాయి సేవలో ప్రశాంతిరెడ్డి



కామాక్షితాయిని దర్శించుకుంటున్న ప్రశాంతిరెడ్డి

బుచ్చిరెడ్డిపాళెం, జూన్ 7: మండలంలోని జొన్నవాడ ఆలయంలో శ్రీమల్లికార్జున స్వామి, కామాక్షితాయి అమ్మవారిని శుక్రవారం కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి దర్శించుకున్నారు. ముందుగా ఈఓ, అర్చకులు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. అనంతరం ప్రత్యేక పూజలు నిర్వహించి తీర్థప్రసాదాలను అందజేశారు. అనంతరం ఈఓ గిరికృష్ణ, అర్చకులు ఎమ్మెల్యేని పట్టువస్త్రాలతో సత్కరించారు. వారి వెంట టీడీపీ నాయకులు బత్తల హరికృష్ణ, శింగారెడ్డి నరసారెడ్డి, హరి, పలువురు నాయకులు కార్యకర్తలు వున్నారు.

కోవూరు ఎమ్మెల్యేకు అభినందనల వెల్లువ



ప్రశాంతిరెడ్డిని అభినందిస్తున్న కోవూరు నాయకులు

కోవూరు, జూన్ 7: కోవూరు ఎమ్మెల్యేగా అత్యధిక మెజారిటీతో గెలిచిన వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డిని నెల్లూరు నగరంలోని ఆమె గృహంలో శుక్రవారం నియోజకవర్గ పరిధిలోని టీడీపీ నాయకులు, కార్యకర్తలు కలిసి అభినందనలు తెలిపారు. పలు శాఖల అధికారులు ఆమెకు పుష్పగుచ్ఛాలు అందించారు. మండల పరిధిలోని టీడీపీ నాయకులు ఇంతా మల్లారెడ్డి, జెట్టి గోపిరెడ్డి, తిరు మూరు అశోక్‌రెడ్డి, జనసేన నాయకులు గాదిరాజు అశోక్‌కుమార్, బీజేపీ నాయకులు గాదిరాజు చక్రవర్తి, గౌడ సంఘం నాయకులు దాసరి విజయకుమార్ గౌడ్, రాష్ట్ర చేనేత సంఘం నాయకులు కేవీ శేషయ్య నాయకత్వంలో నాయకులు, కార్యకర్తలు ప్రశాంతి రెడ్డిని కలిసి అభినందించారు.

బుచ్చిరెడ్డిపాళెం: వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డిని బుచ్చిరెడ్డిపాళెం మండలంలోని పలువురు అధికారులు, నాయకులు శుక్రవారం కలిసి శుభాకాంక్షలు తెలిపారు. బుచ్చి నుంచి ఎర్రంరెడ్డి గోవర్ధన్‌రెడ్డి, సూరా శ్రీనివాసులురెడ్డి, సీఐ హైమారావు, ఏపీఎం లలిత, జొన్నవాడ ఆలయ ఈఓ గిరికృష్ణ, అర్చకులు, సిబ్బంది ప్రశాంతిరెడ్డిని కలిసి పుష్పగుచ్ఛాలిచ్చి, శాలువాలతో సత్కరించి శుభాకాంక్షలు తెలియజేశారు.

అరాచక పాలనకు ప్రజలు చరమగీతం పాడారు

కొడవలూరు: సార్వత్రిక ఎన్నికలలో ఐదేళ్ల వైసీపీ అరాచకపు పాలనకు ప్రజలు చరమగీతం టీడీపీకి పట్టం కట్టారని మాజీ గ్రంథాలయ చైర్మన్ మందిపాటి ప్రవీణ్ కుమార్‌రెడ్డి అన్నారు. వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి భారీ మెజారిటీతో గెలుపొందిన సందర్భంగా నెల్లూరు నగరంలో ఆమె నివాసంలో శుక్రవారం ఆయన మార్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందించి అభినందనలు తెలిపారు. ఆయన వెంట టీడీపీ సీనియర్ నాయకులు ఇరువూరి శ్రీధర్‌రెడ్డి, మందిపాటి రమణారెడ్డి, ఇరువూరి యోగానందరెడ్డి, పి దిలిప్‌కుమార్, బి కుంబ్లే, తదితర నాయకులు ఉన్నారు.

టీడీపీ విజయోత్సవ సంబరాలు


విడవలూరు, జూన్ 7: సార్వత్రిక ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీ ఘన విజయం సాధించడంతో విడవలూరు పంచాయతీలో శుక్రవారం టీడీపీ శ్రేణులు సంబరాలు జరుపుకున్నారు. ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి చెముకుల కృష్ణచైతన్య, మండల పార్టీ అధ్యక్షుడు చెముకుల శ్రీనివాసులు ఆధ్వర్యంలో స్థానిక సినిమాహాల్ నుంచి తహసీల్దారు కార్యాలయం వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా చెముకుల కృష్ణచైతన్య మాట్లాడుతూ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, ప్రశాంతిరెడ్డిలు ఘన విజయం సాధించడానికి టీడీపీ శ్రేణులు ఎంతగానో కృషి చేశారన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు పాశం శ్రీహరిరెడ్డి, మాతూరు శ్రీనివాసులురెడ్డి, ఇమామ్‌బాషా, సమాది శ్రీనివాసులు, దూది విజయరాఘవన్, తదితరులు పాల్గొన్నారు. అలాగే రాంనగర్‌లో గురువారం రాత్రి మాలమహానాడు మహిళా నాయకురాలు శేషమ్మ ఆధ్వర్యంలో సంబరాలు చేసుకున్నారు. ముఖ్య అతిథిగా బెజవాడ శ్రీనివాసులురెడ్డి పాల్గొని కేక్ కట్‌చేసి పేదలకు పంచిపెట్టారు.

ఏఎస్‌ఐకు ఉద్యోగోన్నతి

నెల్లూరు(క్రైం), జూన్ 7: పోలీసుశాఖ గుంటూరు రేంజ్ పరిధిలో ఏడుగురు ఏఎస్‌ఐలకు ఎస్‌ఐలుగా ఉద్యోగోన్నతి కల్పిస్తూ ఐజీ శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఈ క్రమంలో తిరుపతి జిల్లా వెంకటగిరిలో విధులు నిర్వహిస్తున్న ఏఎస్‌ఐ-76 బీ వెంకటేశ్వర్లుకు ఎస్‌ఐగా ప్రమోషనిచ్చి, నెల్లూరు జిల్లాలో రిపోర్టు చేసుకోవాలని ఆదేశించారు.

ఈ మలుపులు ప్రమాదాలకు నెలవులు

హెచ్చరిక బోర్డులకు నోచుకోని రహదారులు



నార్తు రాజుపాళెం టపాతోపు వద్ద ప్రమాదకర మలుపు

కొడవలూరు, జూన్ 7: మండల పరిధిలోని కొన్ని ప్రధాన రహ దారుల్లో మలుపులు ప్రమాదాలకు నెలవులుగా మరాయి. వీటివల్ల ఏ క్షణాన ఏముప్పు వస్తుందోనని పల్లె ప్రజలు ఆందోళన చెందుతు న్నారు. నార్తురాజుపాళెం టపాతోపు జాతీయ రహదారిపైకి వెళ్లే మలు పులో పలు ప్రమాదాలు జరిగాయి. కొడవలూరు మలుపు వద్ద ఇటీవల రెండు బైకులు ఢీకొని తీవ్రంగా గాయపడ్డారు. మండలంలో గండ వరం, రామన్నపాళెం, రెడ్డిపాళెం, మానేగుంటపాడు తదితర గ్రామాల్లో సూమారు 12 చోట్ల ప్రమాదకర మలుపులు ఉన్నాయి. మండలంలో వివిధ గ్రామాల్లోకి వెళ్లే రహదారుల్లో ఉన్న మలుపుల్లో తరచూ ప్రమాదాలు జరుగుతున్నా ఆయా శాఖ అధికారులు మలుపుల వద్ద ముందస్తు హెచ్చరిక బోర్డులైనా ఏర్పాటు చేయడంలేదని ప్రజలు, వాహన చోదకులు వాపోతున్నారు. మండలంలో 24 పంచాయతీలకు సంబంధించి సూమారు 100 కిలోమీటర్ల రహదారులున్నాయని, ఇప్పటికైనా అధికారులు స్పందించి ఈ రహదారుల్లో మలుపుల్లో హెచ్చరిక బోర్డులను ఏర్పాటు చేయాలని కోరుతున్నారు.

ప్రజల రుణం తీర్చుకుంటా..

నగర ఎమ్మెల్యే నారాయణ ● 18 మంది చిరు వ్యాపారులకు తోపుడు బండ్ల పంపిణీ



చిరు వ్యాపారులకు తోపుడు బండ్లను అందజేస్తున్న ఎమ్మెల్యే నారాయణ

నెల్లూరు(వ్యవసాయం), జూన్ 7 : సార్వత్రిక ఎన్నికల్లో తనపై, తెలుగుదేశం పార్టీపై నమ్మకంతో అత్యధిక మెజార్టీతో గెలిపించిన ప్రజల రుణం తీర్చుకునేలా వ్యవహరిస్తానని నగర ఎమ్మెల్యే పొంగూరు నారాయణ తెలిపారు. నగరంలోని 18మంది చిరు వ్యాపారులకు తోపుడు బండ్లను శుక్రవారం గోమతి నగర్‌లోని ఆయన క్యాంపు కార్యాలయంలో అందజే శారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రజల నమ్మకాన్ని ఒమ్ము చేయకుండా నిరుపేదల జీవవనో పాధులు మెరుగుపరచడంతోపాటు నగరాభివృద్ధే లక్ష్యంగా ముందుకు వెళతానని ప్రకటిం చారు. నగర నియోజకవర్గ పరిధిలో 94వేల నివాసాలుంటే దాదాపు 80వేల ఇళ్లను స్వయంగా సందర్శించానన్నారు. అధికంగా తోపుడు బండ్ల మీద ఆధారపడి జీవనం సాగించేవారని, బండ్లు ఇస్తే కొంత ఉపయోగకరంగా ఉంటుందని అడిగారని చెప్పారు. ఎన్నికల కోడ్‌కు ముందు 150 తోపుడు బండ్లు ఇచ్చామని, ఆ తరువాత మరో 200 బండ్లు అడిగారన్నారు. త్వరలో ప్రజలకు ఉపయోగపడే పథకాలన్నీ పునఃప్రారంభిస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర బీసీ సెల్ ఉపాధ్యక్షుడు ధర్మవరం సుబ్బారావు, మున్సిపల్ మాజీ చైర్‌పర్సన్ తాళ్లపాక అనూరాధ, మాజీ జడ్పీటీసీ విజేతరెడ్డి, నగర అధ్యక్షుడు మామిడాల మధు తదితరులు పాల్గొన్నారు.

అభినందనల వెల్లువ



నారాయణతో కురుగొండ్ల రామకృష్ణ

నెల్లూరు(వైద్యం): నెల్లూరు నగర ఎమ్మెల్యేగా ఎన్నికల్లో భారీ మెజారిటీతో విజయం సాధించిన డాక్టర్ పొంగూరు నారాయణను శుక్రవారం పలువురు ప్రముఖులు కలిశారు. ఎన్నికల్లో గెలిచినందుకు సత్కరించి అభినందనలు తెలిపారు. వెంకటగిరి తాజా ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ నారాయణకు పుష్పగుచ్ఛం అందచేసి శుభాకాంక్షలు తెలియచేశారు. 70 వేలకుపైగా మెజారిటీ సాధించడంపై ఆనందం వ్యక్తం చేశారు. నారాయణ అల్లుడు గంటా రవితేజ, ప్రకాశం జిల్లా డీఎఫ్‌వో శ్రీకాంత్‌రెడ్డి, డీటీసీ చందర్, ట్రాఫిక్ డీఎస్పీ తదితరులు కూడా నారాయణను కలిసి శుభాకాంక్షలు తెలిపారు.

సెక్రటరీల సంఘం..

నెల్లూరు (విద్య) : ఏపీ విలేజ్ వార్డ్ సచివాలయ హెల్త్ సెక్రటరీస్, ప్రభుత్వ ఉద్యోగుల ఎంప్లాయీస్ అసోసియేషన్ నాయకులు నారాయణకు అభినందనలు తెలిపారు. శుక్రవారం ఆయనను క్యాంపు కార్యాలయంలో కలిసి సత్కరించారు. అసోసియేషన్ సేవలను మరింత విస్తరించాలని, సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని నారాయణ తెలిపినట్లు అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షురాలు స్నేహలత తెలిపారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి సీహెచ్ కళావతి, నిర్వాహక కార్యదర్శి పీ భాగ్యలక్ష్మి, సంయుక్త కార్యదర్శి వెంకమ్మ, భారతి పాల్గొన్నారు.

ముగిసిన వేసవి శిక్షణ శిబిరాలు



వేసవి విజ్ఞాన తరగతుల శిక్షకుడు సతీష్‌కుమార్‌ను సత్కరిస్తున్న అధికారులు

నెల్లూరు (సాంస్కృతికం), జూన్ 7 : జిల్లా గ్రంథాలయ సంస్థ ఆధ్వర్యంలో మే 19 నుంచి జరుగుతున్న వేసవి విజ్ఞాన తరగతుల శిబిరాలు శుక్రవారంతో ముగిశాయి. ఈ సంవత్సరం ఎన్నికల కోడ్, విపరీతమైన ఎండల కారణంగా వేసవి శిబిరాలు ఆలస్యంగా ప్రారంభమ య్యాయి. విద్యార్థులకు గణితంలో మెలకువలు, చిత్రలేఖనం, వివిధ అంశాలపై క్విజ్ పోటీలు, పేపర్‌తో కళాకృతుల తయారీ, చదవడం, రాయడం, కథలు చెప్పడం వంటివి నేర్పించారు. శుక్రవారం రేబాలవారివీధిలోని జిల్లా గ్రంథాలయంలో ముగింపు సభ నిర్వహించారు. వేసవి విజ్ఞాన తరగతుల్లో నిర్వహించి పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు జిల్లా గ్రంథాలయ కార్యదర్శి కుమార్‌రాజా, డిప్యూటీ లైబ్రేరియన్ ప్రసాద్ బహుమతులు పంపిణీ చేశారు. వేసవి శిక్షణ తరగతులను చక్కగా నిర్వహించిన ప్రజా సైన్స్ వేదిక పట్టణ అధ్యక్షుడు ఎం సతీష్‌కుమార్‌ని సత్కరించారు.

● డైకస్‌రోడ్డు సెంటర్‌లోని జస్టిస్ అన్సారీ గ్రంథాలయంలో నిర్వహించిన వేసవి విజ్ఞాన తరగతులు కూడా ముగిశాయి. వేసవి తరగతుల్లో నిర్వహించిన వివిధ రకాల పోటీల విజేతలకు బహుమలు అందజేవారు. ఆర్ఎస్ఆర్ హైస్కూల్ ఉపాధ్యాయుడు సతీష్‌కుమార్, గ్రంథపాలకురాలు చంద్రగిరి ఈశ్వరమ్మ, పాఠకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఎస్పీ, కమిషనర్‌తో గిరిధర్‌రెడ్డి భేటీ

నెల్లూరు(సిటీ): జిల్లా ఎస్పీ ఆరీఫ్ హఫీజ్, నగర కమిషనర్ వికాస్ మర్మత్‌ను టీడీపీ నాయకుడు కోటంరెడ్డి గిరిధర్‌రెడ్డి శుక్రవారం వారి వారి కార్యాలయాల్లో మర్యాద పూర్వ కంగా కలిశారు. టీడీపీ అధికారంలోకి రావడంతో తొలిసారిగా ఎస్పీని కలిసి పుష్ప గుచ్ఛం అందచేశారు. రూరల్ నియోజకవర్గానికి సంబంధించిన కొన్ని అంశాలపై చర్చించారు. కమిషనర్‌తో భేటలోనూ నియోజకవర్గం పరిధిలోకి వచ్చే మున్సిపల్ డివిజన్ల సమస్యలపై చర్చించారు. కాగా, కార్పొరేషన్ ఆరోగ్య అధికారి డాక్టర్ వెంకట రమణయ్య నగర ఎమ్మెల్యే పొంగూరు నారాయణ, రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి, ఆయన సోదరుడు గిరిధర్ రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. లైసెన్స్ ఇంజనీర్లు కూడా నారాయణను కలిసి శుభాకాంక్షలు తెలిపారు.

టీడీపీ విజయోత్సవ ర్యాలీ

నెల్లూరు రూరల్, జూన్ 7 : ఎన్నికల్లో టీడీపీ అఖండ మెజార్టీతో గెలిచిన నేపథ్యంలో ఆ పార్టీ శ్రేణులు శుక్రవారం ధన లక్ష్మీపురంలో సంబరాలు, విజయోత్సవ ర్యాలీ నిర్వహించాయి. నెల్లూరు - ముత్తుకూరు రహదారిపై డీజే డ్యాన్సులతో రంగులు చల్లుతూ సంతోషం వ్యక్తం చేశాయి. రూరల్లో కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి హ్యాట్రిక్ ఎమ్మెల్యేగా చరిత్రకెక్కారని కొనియాడారు. ఇక రాష్ట్రంలో ప్రజాపాలన మొదలవుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు కుంచాల విజయభాస్కర్, కుడుముల నాగేశ్వరరావుగౌడ్, ఆల్తూరి మస్తానయ్య, బీరం పవన్‌కుమార్‌రెడ్డి, గౌస్‌అహ్మద్, అఫ్సర్‌బాషా, మావిళ్ల మధుసూదన్‌రెడ్డి, గుంజి రవి, శ్రీను పాల్గొన్నారు.



ప్రశాంతిరెడ్డికి శుభాకాంక్షలు తెలియచేస్తున్న వంకి పెంచలయ్య

ప్రశాంతిరెడ్డికి శుభాకాంక్షలు

నెల్లూరు(హరనాథపురం); జూన్ 7 : కోవూరు ఎమ్మెల్యేగా ఎన్నికైన వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డికి శుభాకాంక్షలు తెలియచేసేందుకు నాయకులు, కార్యకర్తలు భారీగా తరలి వస్తున్నారు. నెల్లూరులోని వీపీఆర్ నివాసానికి శుక్రవారం చేరుకున్న వారు ప్రశాంతిరెడ్డిని పుష్పగుచ్ఛాలు, శాలువాలతో ఘనంగా సత్కరించారు. టీడీపీ నాయకులతో పాటు నియోజకవర్గ పరిధిలోని రెవెన్యూ, పోలీసు, ఇతర శాఖలకు సంబంధించిన అధికారులు ఆమెను మర్యాద పూర్వకంగా కలిసి అభినందనలు తెలియచేస్తున్నారు. నెల్లూరు మున్సిపల్ మాజీ చైర్‌పర్సన్ తాళ్లపాక అనురాధ, జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ మందపాటి ప్రవీణ్ కుమార్‌రెడ్డి, ఆదిశంకర ఇంజనీరింగ్ కళాశాల చైర్మన్ వంకి పెంచలయ్య, మెప్మా పీడీ రవీంద్ర, కోవూరు నియోజకవర్గ సీఐలు, ఎస్ఐలు, ఇతర ముఖ్య నాయకులు, కార్యకర్తలు ఆమె శుభాకాంక్షలు తెలిపారు.

క్రీడాకారులకు పౌష్టికాహారం పంపిణీ

నెల్లూరు (విద్య), జూన్ 7 : నగరంలోని ఏసీ సుబ్బారెడ్డి స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లో వేసవి క్రీడాశిక్షణ శిబిరాల్లో సాధన చేస్తున్న క్రీడాకారులకు వివేకానంద వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శుక్రవారం పౌష్టికాహారాన్ని పంపిణీ చేశారు. నందిమండలం బాలకృష్ణంరాజు దాతగా వ్యవహరించారు. ఈ కార్యక్రమంలో వాకర్స్ అసోసియేషన్ నాయకులు, సభ్యులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

నెల్లూరు (జడ్పీ), జూన్ 7 : విద్యుత్ లైన్లకు మరమ్మతులు చేస్తున్నందున నగరంలోని పలు ప్రాంతాల్లో శనివారం విదుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు నగర ఈఈ సోమశేఖర్‌రెడ్డి ఓ ప్రకటనలో పేర్కొన్నారు. తెలుగుగంగ సబ్ స్టేషన్ పరిధిలో శనివారం ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు, శెట్టిగుంటరోడ్డు సబ్ స్టేషన్ పరిధిలో ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు, ఎన్టీఆర్ నగర్ సబ్ స్టేషన్ పరిధిలో ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు, ఆటో నగర్ సబ్ స్టేషన్ పరిధిలో ఉదయం 7 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదని తెలిపారు. చాణక్యపురి, ఏపీకే ఎస్టేట్, వీఎంఆర్ నగర్, ఆర్‌సీఆర్ నగర్, శాంతి నగర్, గాంధీనగర్, సుభాష్‌చంద్రబోస్ నగర్, వేణుగోపాల్ నగర్, జకీర్ హుస్సేన్ నగర్, ప్రశాంతి నగర్, కిసాన్ నగర్, 3వ మైలు, ఎన్టీఆర్ నగర్, వెంకట్‌రెడ్డి నగర్, చైతన్యపురి కాలనీ తదితర ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందన్నారు.

అతిసార బాధితులకు పరామర్శ

నెల్లూరు(వైద్యం) : ముత్తుకూరు మండలం పైనాపురం గ్రామంలో అతిసార వ్యాధికి గురై నగరంలోని పలు ఆసుపత్రుల్లో చికిత్స పొందుతున్న వారిని సీపీఎం జిల్లా కార్యదర్శి మూలం రమేష్ శుక్రవారం పరామర్శించారు. నారాయణ, అపోలో, రామచంద్రారెడ్డి, జయభారత్ ఆసుపత్రుల్లో చికిత్స పొందుతున్న వారిని పరామర్శించి, మంచి వైద్యం అందించాలని వైద్యులను కోరారు. నారాయణ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ కావలి రమణమ్మ మృతి చెందిందని, విషయాన్ని అధికారుల దృష్టికి తీసుకువెళ్లాలని పార్టీ నేతలకు సూచించారు. దాదాపు 20 మంది డయేరియా వ్యాధికి గురికావటం ఆందోళనకరమన్నారు. కార్యక్రమంలో సీపీఎం నేత గోగుల శ్రీనివాసులు పాల్గొన్నారు.

నాదెండ్ల మనోహర్‌కు శుభాకాంక్షలు

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట), జూన్ 7: తెనాలి శాసనసభ్యుడిగా గెలుపొందిన జనసేన పార్టీ పీఏసీ చైర్మన్ నాదెండ్ల మనోహర్‌ను ఆ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి గునుకుల కిషోర్, ఆయన సతీమణి శుక్రవారం తెనాలిలో కలిశారు. ఎన్నికల్లో గెలిచినందుకు పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. త్వరలో ఏర్పడబోయే ప్రభుత్వంలో మనోహర్‌కు మంత్రి పదవి దక్కాలని కోరుకుంటున్నామన్నారు.



అమాత్యులెవరు?

మంత్రి పదవులపై సర్వత్రా చర్చ

చిత్తూరు ఎంపీకి కేంద్ర మంత్రిగా ఛాన్సు

రాష్ట్ర మంత్రి పదవి కోసం పలువురి యత్నాలు

అందరిలోనూ ఆశలు


ఒకట్రెండు రోజుల్లో స్పష్టత వచ్చే అవకాశం



అమరనాథరెడ్డి



దగ్గుమళ్ళ ప్రసాదరావు



కిషోర్‌కుమార్‌రెడ్డి

రాష్ట్రంలో అధికారం మారిన నేపథ్యంలో రేపు ప్రధానిగా నరేంద్ర మోదీ, అలాగే ఈనెల 12న సీఎంగా చంద్రబాబు ప్రమాణస్వీకారాలు చేయనున్నారు. ఆయా తేదీల్లోనే కేంద్ర, రాష్ట్ర మంత్రివర్గాలు కూడా ఏర్పాటయ్యే అవకాశాలున్నాయి. లేదంటే కొన్ని రోజుల ఆలస్యం అయినా మొత్తం మీద ఈ నెలలోనే పూర్తిస్థాయి కేంద్ర, రాష్ట్ర మంత్రివర్గాలు ఏర్పాటు కానున్నాయి. దీంతో జిల్లా నుంచీ ఎవరెవరికి మంత్రి పదవులు లభించే అవకాశముంది? ఏ ప్రాతిపదికన? అన్న అంశాలు సర్వత్రా చర్చనీయాంశమవుతున్నాయి. కూటమిలో ఏ పార్టీలో ఎవరికి? సామాజికవర్గాల రీత్యా అయితే ఎవరికి? కొత్త జిల్లాల ప్రకారమా లేక ఉమ్మడి జిల్లాల ప్రకారమా? అన్న ప్రశ్నలు అటు రాజకీయ వర్గాలతోపాటు జనంలోనూ వినిపిస్తున్నాయి. మరోవైపు ఈ చర్చలతో నిమిత్తం లేకుండా జిల్లా నుంచీ పలువురు ఎమ్మెల్యేలు మంత్రి పదవి కోసం ప్రయత్నాలు మొదలుపెట్టారు.

తిరుపతి, జూన్ 7 (ఆంధ్రజ్యోతి): టీడీపీ వర్గాల సమాచారం మేరకు కేంద్ర మంత్రివర్గంలో ఎస్సీ సామాజికవర్గం నుంచీ చిత్తూరు ఎంపీ దగ్గుమళ్ళ ప్రసాదరావు పేరు పరిశీలనలో వుంది. అధిష్ఠానం వద్ద గణనీయమైన పలుకుబడి వున్న కారణంగానే ఆయన ప్రకాశం జిల్లావాసి అయినా చిత్తూరు ఎంపీ టికెట్ తెచ్చుకున్నారని, దానికి తోడు ఎన్నికల్లో అసెంబ్లీ అభ్యర్థుల విజయానికి వీలైన మేరకు ఆర్థికంగా సహకరించారని ఆ వర్గాలు చెబుతున్నాయి. ఉన్నత విద్యావంతుడు కావడం, అఖిల భారత సర్వీసుల అధికారిగా పనిచేసిన నేపథ్యం,అధిష్ఠానం వద్ద పలుకుబడి ఆయనకు అదనపు అర్హత కాగలదని సమాచారం.

రాష్ట్ర మంత్రులుగా ప్రచారంలో ఇద్దరి పేర్లు

తిరుపతి, ఉమ్మడి చిత్తూరు జిల్లాల్లో ఎవరికి మంత్రి పదవులు లభిస్తాయన్నది మిలియన్ డాలర్ల ప్రశ్నగా మారుతోంది. ఉమ్మడి జిల్లాలో 14 స్థానాలు, నెల్లూరు నుంచీ కొత్తగా తిరుపతి పరిధిలోకి చేరిన మూడు స్థానాలూ కలిపి మొత్తం 17 స్థానాలకు గానూ 15 చోట్ల కూటమి అభ్యర్థులు గెలిచిన సంగతి తెలిసిందే. అందులో ఒకరు జనసేన కాగా మిగిలిన వారు టీడీపీకి చెందినవారు. కొత్త జిల్లాల ప్రాతిపదికన మంత్రి పదవులకు ఇద్దరి పేర్లు ప్రచారంలో వున్నాయి. చిత్తూరు జిల్లా నుంచీ పలమనేరు ఎమ్మెల్యే అమరనాథరెడ్డి, అన్నమయ్య జిల్లా నుంచీ పీలేరు ఎమ్మెల్యే నల్లారి కిషోర్‌కుమార్‌రెడ్డి పేర్లు ప్రధానంగా వినిపిస్తున్నాయి. అమరనాథరెడ్డి విషయానికి వస్తే కుటుంబానికి సుదీర్ఘ రాజకీయ నేపథ్యం వుండడం, డీసీసీబీ ఛైర్మన్‌గా, ఐదుసార్లు ఎమ్మెల్యేగా ఎన్నిక కావడంతో పాటు ఉమ్మడి జిల్లా టీడీపీ అధ్యక్షుడిగానూ, మంత్రిగానూ పనిచేసిన అనుభవం ఆయనకు అర్హతలని చెబుతున్నాయి. జిల్లాలో నాయకులను సమన్వయం చేసుకుని పార్టీని ముందుకు నడిపించిన నేతగా ఆయనకు అధిష్ఠానం వద్ద ప్రత్యేక గుర్తింపు వుంది. దానికి తోడు స్థానిక సంస్థల ఎన్నికల్లో కుప్పంలో అధికార పార్టీ వర్గాల ఆగడాలను ఎదుర్కొనడం, నారా లోకేశ్ యువగళం పాదయాత్ర నిర్వహణలో రాయలసీమవ్యాప్తంగా కీలక బాధ్యతలు నిర్వర్తించడం, ఆ క్రమంలో 24 పోలీసు కేసులను ఎదుర్కొనడం ఆయనకు కలిసివస్తుందని పార్టీ వర్గాలు చెబుతున్నాయి. ఇక పీలేరు ఎమ్మెల్యే కిషోర్ కుటుంబానికి సైతం సుదీర్ఘ రాజకీయ నేపథ్యం వున్న సంగతి తెలిసిందే. తండ్రి మంత్రిగా, అన్న సీఎంగా పనిచేసి వుండడంతో పాటు కిషోర్ గత టీడీపీ ప్రభుత్వంలో హౌసింగ్ కార్పొరేషన్ ఛైర్మన్‌గా పనిచేశారు. పార్టీలో జాతీయ ప్రధాన కార్యదర్శి పదవితో అధిష్ఠానం ఆయనకు ప్రత్యేక గుర్తింపు కల్పించింది. పుంగనూరు సెగ్మెంట్‌లో వైసీపీ ముఖ్యనేత పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డిని ఎదుర్కోవడంతో పాటు తంబళ్ళపల్లి, మదనపల్లె నియోజకవర్గాల్లో కూడా పార్టీ బలోపేతానికి కృషి చేశారన్న పేరుంది. చంద్రబాబుపై కురబలకోటలో వైసీపీ దాడుల ఘటనకు సంబంధించి కిషోర్ పోలీసు కేసులు కూడా ఎదుర్కొన్నారు. వీటన్నింటికీ మించి రాజంపేట పార్లమెంటు పరిధిలో మొత్తం ఏడు స్థానాలకు గానూ వైసీపీ మూడు అసెంబ్లీ సీట్లు, ఒక ఎంపీ సీటు గెలిచి బలంగా ఉనికి చాటుకుంది. అక్కడ టీడీపీ రెండు సీట్లకు, జనసేన ఒక సీటుకు పరిమిత వంయయ్యాంయ. అలాంటి చోట పార్టీని బలోపేతం చేసి ముందుకు తీసుకెళ్ళడానికి కిషోర్ సేవలు అవసరమని పార్టీ వర్గాలు చెబుతున్నాయి.

సామాజికవర్గాలవారీగా అవకాశాలపై ఆశలు

సామాజిక సమీకరణలు, కూటమి పార్టీల సమీకరణల దృష్ట్యా పలువురు మంత్రి పదవులు ఆశిస్తున్నారు. మదనపల్లె నుంచీ టీడీపీ తరపున గెలిచిన షాజహాన్ బాషాకు ముస్లిం మైనారిటీ కోటాలో మంత్రి పదవి దక్కుతుందని ముస్లిం మైనారిటీ వర్గాలు ఆశిస్తున్నాయి.తిరుపతి ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు రాయలసీమ మొత్తం మీద జనసేన తరపున బలిజ సామాజిక వర్గం నుంచీ గెలిచిన ఏకైక ఎమ్మెల్యే కావడంతో ఆయనకు మంత్రి పదవి గ్యారంటీ అని ఆ సామాజికవర్గం గట్టి నమ్మకంతో వుంది. ఆ మేరకు ఆయన కూడా తన ప్రయత్నాలు ముమ్మరం చేశారు. శ్రీకాళహస్తి ఎమ్మెల్యే బొజ్జల సుధీర్ రెడ్డి కుటుంబ నేపథ్యం, ఆయన తండ్రి దివంగత బొజ్జల గోపాలకృష్ణారెడ్డి అధినేత చంద్రబాబుకు సన్నిహిత మిత్రుడు కావడం వంటి కారణాలతో తిరుపతి జిల్లా నుంచీ ఆయనకు అవకాశం వుంటుందని అక్కడి పార్టీ వర్గాలు విశ్వసిస్తున్నాయి. ఇక చిత్తూరు జిల్లాలో మాజీ మంత్రి గాలి ముద్దుకృష్ణమ నాయుడు కుమారుడైన నగరి ఎమ్మెల్యే గాలి భానుప్రకాశ్‌కు చాన్సు దక్కుతుందని ఆయన అనుచరులు భావిస్తున్నారు.టీడీపీకి కంట్లో నలుసుగా మారిన మాజీ మంత్రి రోజాను భారీ మెజారిటీతో ఓడించిన భానుకు మంత్రి పదవి తప్పక దక్కుతుందన్న విశ్వాసం వ్యక్తం చేస్తున్నారు.ఇక తిరుపతి జిల్లాలో చంద్రగిరి ఎమ్మెల్యే పులివర్తి నానీ గురించి చెప్పక్కర్లేదు.చంద్రబాబు సొంత నియోజకవర్గమైన చం ద్రగిరిలో పాతికేళ్ళ తర్వాత రికార్డు మెజారిటీతో గెలిచిన నానీకి అధినేత వద్ద,యువనేత లోకేశ్ వద్ద ప్రత్యేక గుర్తిం పు వుంది. గత ప్రభుత్వంలో అధికార పార్టీని ఎదుర్కొని, పార్టీని బలోపేతం చేసే క్రమంలో అనేక ఇబ్బందులకు గురైన నానీకి మంత్రి పదవితో అధిష్ఠానం న్యాయం చేస్తుందని చంద్రగిరి పార్టీ వర్గాలు భావిస్తున్నాయి.వెంకటగిరి ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ సీనియర్ నేత కావడంతో పాటు వియ్యంకుడైన పారిశ్రామికవేత్త గంగాప్రసాద్ అధినేత చంద్రబాబుకు సన్నిహితుడు కావడం వల్ల అవకాశాల్లేకపోలేదని అనుచరవర్గం ఆశాభావంతో వుంది. మాజీ సీఎం నేదురుమల్లి జనార్దనరెడ్డి కుమారుడిని ఓడించడం అదనపు అర్హతగా భావిస్తోంది.

ఎస్సీ సామాజిక వర్గం నుంచీ...

వైద్యరంగంలో ప్రముఖుడు కావడం, అధినేత చంద్రబాబుతో సన్నిహితత్వం వుండడం,మాజీ డిప్యూటీ సీఎం నారాయణస్వామి కుమార్తెను ఓడించడం వంటి కారణాలతో గంగాధర నెల్లూరు ఎమ్మెల్యే థామస్‌కు ఎస్సీ కోటాలో మంత్రి పదవి దక్కుతుందని స్థానిక పార్టీ వర్గాలు భావిస్తున్నాయి.ఎస్సీ మహిళ కోటాలో వైద్యురాలైన సూళ్ళూరుపేట యువ ఎమ్మెల్యే నెలవల విజయశ్రీకి మంత్రివర్గంలో చోటుదక్కే అవకాశాల్లేకపోలేదని అక్కడి పార్టీ శ్రేణులు ఆశాభావంతో వున్నాయి. తండ్రి గతంలో ఎమ్మెల్యేగా, ఎంపీగా పనిచేసి వుండడం ఆమెకు అనుకూలిస్తుందని చెబుతున్నాయి. అలాగే గూడూరు ఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్ సీనియారిటీ కారణంగా ఎస్సీ కోటాలో చాన్సుంటుందని ఆయన అనుచరవర్గం నమ్ముతోంది. వైసీపీ ముఖ్యనేత పెద్దిరెడ్డి రామచంద్రా రెడ్డిని సవాల్ చేసిన నేతగా పేరుతెచ్చుకోవడంతో పాటు సత్యవేడులో సంచలన విజయం సాధించిన కోనేటి ఆదిమూలం మంత్రి పదవికి అర్హుడని అక్కడి పార్టీ వర్గాలు భావిస్తున్నాయి. ఇలా మంత్రి పదవుల కోసం తిరుపతి, ఉమ్మడి చిత్తూరు జిల్లాల పరిధిలో విస్తృతస్థాయిలో జనం మధ్య చర్చ నడుస్తోంది. రానున్న ఒకటి రెండు రోజుల్లో దీనిపై స్పష్టత వచ్చే అవకాశముంది.



శ్రీహరి సేవలో హైకోర్టు న్యాయమూర్తి

తిరుమల, జూన్7(ఆంధ్రజ్యోతి): ఏపీ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ జ్యోతిర్మయి శుక్రవారం తిరుమల శ్రీవారిని దర్శించుకున్నారు. ఉదయం వీఐపీ బ్రేక్ సమయంలో ఆలయంలోకి వెళ్లిన ఆమె ముందుగా ధ్వజస్తంభానికి మొక్కుకుని తర్వాత గర్భాలయంలోని మూలమూర్తిని దర్శించుకున్నారు. అనంతరం రంగనాయకమండపానికి చేరుకోగా వేదపండితులు ఆశీర్వదించగా అధికారులు లడ్డూప్రసాదాలు అందజేశారు.

ఏపీకి స్వర్ణయుగం మొదలైంది
నటుడు శివాజీ



తిరుమల, జూన్7(ఆంధ్రజ్యోతి): 'స్వామిని చూస్తే కళకళలాడుతున్నారు. ఇంతకుముందు తేడాగా ఉన్నారు. స్వామి దగ్గర డ్రామాలు దొబ్బితే ఎవరికైనా ఇదే శిక్ష' అని సినీనటుడు శివాజీ వ్యాఖ్యానించారు. తిరుమల శ్రీవారిని శుక్రవారం దర్శించుకున్న ఆయన ఆలయం ముందు మీడియాతో మాట్లాడారు. ఏపీకి స్వర్ణయుగం మొదలైందని, ఇది స్వామి నిర్ణయమన్నారు.అమరావతి, పోలవరం ఏపీకి లక్ష్యాలని, స్వామి దగ్గర మాట ఇచ్చినోళ్లకి ఎటువంటి పాఠాలు నేర్పించాడో అందరూ చూశారన్నారు.చంద్రబాబు నాయకత్వాన టీడీపీ, బీజేపీ, జనసేన ఆధ్వర్యంలో ఏపీ అద్భుతమైన ప్రగతి సాధిస్తుందన్నారు. అందులో ఎలాంటి అనుమానం లేదన్నారు. 'మీరు తిట్టినా కొట్టినా తిరిగి కర్మ మీ చుట్టూ తిరిగింది. మిమల్ని ప్రజలు తిడుతున్నారు, కొడుతున్నారు. అవసరమా' అని వైసీపీని ఉద్దేశించి వ్యాఖ్యానించారు. ఎవరైనా ప్రజలను ఇబ్బంది పెట్టకూడదన్నారు. కాగా, బాలీవుడ్ నిర్మాత ఏక్తాకపూర్ కూడా శ్రీవారిని దర్శించుకున్నారు.

ఎన్నికలు ప్రశాంతంగా ముగిశాయి
ముఖేష్ కుమార్ మీనా



తిరుమల, జూన్7 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ఎన్నికల ప్రక్రియ ప్రశాంతంగా ముగిసిన సందర్భంగా శ్రీవారి ఆశీస్సులు తీసుకునేందుకు వచ్చినట్టు రాష్ట్ర ఎన్నికల ప్రధానాధికారి ముఖేష్‌కుమార్ మీనా తెలిపారు. తిరుమల వేంకటేశ్వరస్వామిని శుక్రవారం ఉదయం దర్శించుకున్న ఆయనకు ఆలయ అధికారులు ప్రత్యేక దర్శన ఏర్పాట్లు చేసి లడ్డూప్రసాదాలు అందజేశారు. అనంతరం ఆయన ఆలయం ముందు మీడియాతో మాట్లాడుతూ.. ఎన్నికల ప్రక్రియను ప్రొఫెషనల్ పద్ధతిలో నిర్వహించామన్నారు. కొత్త ప్రభుత్వం బాధ్యతలు చేపట్టేందుకు సిద్ధంగా ఉందన్నారు.

పెళ్లకూరులో ఉద్రిక్తత

● టీడీపీ శ్రేణులపై దాడి కేసులో కామిరెడ్డి సహా 9మంది అరెస్ట్



సత్యనారాయణరెడ్డిని కోర్టుకు తీసుకెళుతున్న పోలీసులు



పోలీస్ స్టేషన్ ఎదుట బైఠాయించిన మహిళలతో చర్చిస్తున్న పోలీసులు

పెళ్లకూరు, జూన్ 7: వైసీపీ నేత, ఎన్డీసీసీబీ మాజీ ఛైర్మన్ కామిరెడ్డి సత్యనారాయణరెడ్డి అరెస్ట్‌తో పెళ్లకూరు పోలీస్ స్టేషన్ వద్ద ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. ఎన్నికల్లో టీడీపీ విజయం సాధించడంతో చిల్లకూరుకు చెందిన టీడీపీ కార్యకర్త దువ్వూరు విజయసేనారెడ్డి గురువారం రాత్రి తన ఇంటి వద్ద టపాకాయలు కాల్చి సంబరాలు చేసుకున్నారు. ఈ క్రమంలో అదే గ్రామానికి చెందిన వైసీపీ నేత కామిరెడ్డి అనుచరులు అతడిపై మూకుమ్మడి దాడికి పాల్పడగా ఆయన కుమారుడు దువ్వూరు రాకేష్‌రెడ్డి అడ్డురావడంతో ఆయనపై కూడా దాడి చేశారు.బాధితుల ఫిర్యాదు మేరకు దాడికి ప్రేరేపించిన కామిరెడ్డితో పాటు ఆయన అనుచరులు 8మందిని గురువారం అర్ధరాత్రి పోలీసులు అదుపులోకి తీసుకుని స్టేషన్‌కు తరలించారు.ఈ విషయం తెలుసుకున్న వైసీపీ శ్రేణులతో పాటు మాజీ ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య శుక్రవారం ఉదయం స్టేషన్ వద్దకు చేరుకుని పోలీసులతో వాగ్వాదానికి దిగడంతో పరిస్థితి ఉద్రిక్తంగా మారింది.ఏఎస్పీ కులశేఖర్, డీఎస్పీ శ్రీనివాసులురెడ్డి, సీఐలు జగన్మోహన్‌రావు, శ్రీనివాసులురెడ్డి,ఎస్ఐలు రవిబాబు, గోపి, తిరుమలరావు తదితరులు వైసీపీ నేతలతో చర్చించడంతో పరిస్థితి సద్దుమణిగింది. కామిరెడ్డితో పాటు ఆయన అనుచరులపై 307వ సెక్షన్ కింద కేసు నమోదు చేసి సాయంత్రం కోర్టుకు తరలించారు.గతంలో ఇరు వర్గాలకు పాతకక్షలున్న నేపథ్యంలో విజయసేనారెడ్డి టపాకాయలు కాల్చడంతో అవి గడ్డివాములు, ఇళ్లపై పడుతున్నాయని సత్యనారాయణరెడ్డి అనుచరులు దాడికి పాల్పడ్డారని ఎస్ఐ శ్రీకాంత్ చెప్పారు.విజయసేనారెడ్డి, రాకేష్‌రెడ్డి కలబడడంతో వారికి గాయ్యాలయ్యాయని తెలిపారు. వైసీపీ నేతల ఫిర్యాదు మేరకు వారిపైనా 324వ సెక్షన్ కింద కేసు నమోదు చేసినట్లు తెలిపారు.మరో 15 మంది అనుమానితులపై కూడా విచారణ జరిపి కేసులు నమోదు చేయనున్నట్లు ఎస్ఐ తెలిపారు.



నీరబ్‌కుమార్ ప్రసాద్



ముద్దాడ రవిచంద్ర

చిత్తూరు మాజీ కలెక్టర్లకు
కొత్త ప్రభుత్వంలో కీలక కొలువులు

చిత్తూరు కలెక్టరేట్, జూన్ 7: గతలో ఉమ్మడి చిత్తూరు జిల్లా కలెక్టర్లుగా పనిచేసినవారిలో ఇద్దరు కూటమి ప్రభుత్వంలో కీలక బాధ్యతల్లో ఉండబోతున్నారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి (సీఎస్)గా నియమితులైన సీనియర్ ఐఏఎస్ అధికారి నీరబ్‌కుమార్ ప్రసాద్ 1998లో చిత్తూరు జిల్లా కలెక్టర్‌గా పనిచేశారు. ఈ బాధ్యతల్లో ఆయన ఉన్నది 9 నెలలే అయినా అప్పటి తెలుగుదేశం ప్రభుత్వం ప్రవేశపెట్టిన జన్మభూమి కార్యక్రమాలను విజయవంతంగా నిర్వహించారు. జిల్లాలో ఆ సమయంలో కరువు తీవ్రంగా ఉంది. మండలాల్లో విస్తృతంగా పర్యటిస్తూ పనికి ఆహార పథకాన్ని ఆయన సమర్థంగా అమలు చేశారు. ఈయన 1987 బ్యాచ్‌కు చెందిన ఐఏఎస్ అధికారి. చంద్రబాబు నాయుడు పాలనలో కీలక శాఖలకు ముఖ్య కార్యదర్శిగా ఆయన పనిచేశారు.

- ఇక 2008-09లో చిత్తూరు జిల్లా కలెక్టర్‌గా బాధ్యతలు నిర్వహించిన ముద్దాడ రవిచంద్ర ఏపీ సీఎం ముఖ్య కార్యదర్శిగా సీఎంవోలో బాధ్యతలు స్వీకరించనున్నారు.ఈయన 1996 బ్యాచ్‌కు చెందిన ఐఏఎస్ అధికారి.

రాజీనామా చేసి వెళ్లండి



ఎస్వీయూ వీసీ శ్రీకాంత్‌రెడ్డితో మాట్లాడుతున్న తెలుగు యువత నాయకులు

● ఎస్వీయూ వీసీకి తెలుగు యువత విజ్ఞప్తి

తిరుపతి(విశ్వవిద్యాలయాలు), జూన్ 7: 'టీడీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చింది.. వైసీపీ ప్రభుత్వ హయాంలో నియమితులైన మీరు పదవికి రాజీనామా చేసి వెళ్లండి' అంటూ ఎస్వీయూ వీసీ శ్రీకాంత్‌రెడ్డికి తెలుగు యువత నాయకులు విజ్ఞప్తి చేశారు. తెలుగు యువత రాష్ట్ర అధికార ప్రతినిధి ఆనంద్‌గౌడ్, రాష్ట్ర అధికార ప్రతినిధి శేషాద్రి నాయుడు, నాయకులు రామ్మోహన్, కృష్ణమూర్తి తదితరులు శుక్రవారం వీసీ చాంబర్‌కు వెళ్లి పదవికి రాజీనామా చేయాలంటూ వీసీ శ్రీకాంత్‌రెడ్డికి సూచించారు. టీడీపీ ప్రభుత్వ హయాంలో వీసీగా వచ్చిన రాజేంద్ర ప్రసాద్‌ను గతంలో వైసీపీ ప్రభుత్వ హయాంలో తీవ్రంగా అవమానించి.. పంపారని గుర్తుచేశారు. అలాంటి పని చేయబోమని, తమకు సంస్కారం ఉందని చెప్పారు. అందువల్ల పదవికి రాజీనామా చేయాలని కోరారు. ఇక ఎన్నికల్లో వైసీపీకి అనుకూలంగా ప్రచారం చేసినట్టు తమ వద్ద వాయిస్ మెసేజ్‌లు ఉన్నాయని, గత వీసీ రాజేంద్రప్రసాద్ పదవి నుంచి పంపడంలో మీప్రమేయం కూడా ఉందని ఆరోపించారు. తనకు తెలిసిన ఓ టీడీపీ ఎమ్మెల్యేతో సంప్రదించి నిర్ణయం తీసుకుంటానని వీసీ చెప్పగా, తెలుగు యువత నాయకులు ససేమిరా అన్నారు. దీంతో తీవ్ర వాగ్వాదం జరగడంతో సెక్యూరిటీ సిబ్బంది ఇటు వీసీని, అటు నాయకులకు సర్దిజెప్పారు. ఈ క్రమంలో వీసీ తన చాంబర్ నుంచి వెళ్లిపోయారు. వైసీపీ ప్రభుత్వ హయాంలో పదవులు పొందిన వారు స్వచ్ఛందంగా రాజీనామా చేయాలని ఆనంద్‌గౌడ్ సూచించారు. లేకుంటే తామే పదవుల నుంచి సాగనంపుతామని స్పష్టం చేశారు. కాగా, టీడీపీ, తెలుగు యువత నాయకుల ఆందోళనతో ఎస్వీయూ వీసీ బంగ్లా వద్ద పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు.

సహనం కోల్పోకండి

శాంతి భద్రతల పరిరక్షణకు సహకరించాలంటూ ప్రజలకు పోలీసుల విజ్ఞప్తి

తిరుపతి(నేరవిభాగం), జూన్ 7 : ఎన్నికల ఫలితాలు వెలువడ్డ తరువాత కొన్ని ప్రాంతాల్లో వర్గ వైషమ్యాలు, హింసాత్మక ఘటనలు చోటుచేసుకోవడం ఆందోళనకరమైనప్పటికీ ప్రజలెవరూ సహనం కోల్పోకూడదని ఎస్పీ హర్షవర్ధనరాజు ఓ ప్రకటనలో విజ్ఞప్తి చేశారు.అనవసరంగా ఆవేశాలకు లోనై హింస చెలరేగే విధంగా ఎవరూ ప్రవర్తించకూడదన్నారు.చట్ట పరిధిలో అందరూ సమానమనే విషయం మరిచిపోకూడదన్నారు. రౌడీయిజం, దౌర్జన్యం ఎవ్వరు చేసినా చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. శాంతి భద్రతల పరిరక్షణ విషయంలో ఎప్పటిలాగే ప్రజలందరూ పోలీసులకు సహకరించాలని ఎస్పీ కోరారు.

నివాసాల మధ్య వరాహ సంచారం

- పెరుగుతున్న దోమలు
- వెంటాడుతున్న సీజనల్ వ్యాధుల భయం

బాలాయపల్లి, జూన్ 7: మండలంలోని పలు గ్రామాల్లో పందులు స్వైరవిహారం చేస్తున్నాయి. వెంగమాంబపురం, పచ్చారుచేను, యాచవరం, కడగుంట, బాలాయపల్లి సహా ఇతర గ్రామాల్లో ప్రజలు హడలిపోతున్నారు. పందులు నివాసాల మధ్యలో తిరగడమే కాకుండా ఇళ్లలోకి చొరబడుతున్నాయని పజలు వాపోతున్నారు. వర్షాలు కురుస్తుండడంతో నీటి నిల్వలు చేరి అపరిశుభ్రంగా తయారవుతున్నాయి. ఆ నీటిలో పందులు చేరడంతో పరిసరాలు దుర్గంధభరితంగా తయారవుతున్నాయి. వానలు కురుస్తుండడంతో దోమలు ప్రబలి డెంగ్యూ, మలేరియా, విషజ్వరాల బారిన పడతామేమోనని గ్రామస్తులు భయపడుతున్నారు. పందుల సంచారం ఎక్కువగా ఉండడంతో బోర్ల కింద వేసిన పంటలు ధ్వంసం చేస్తాయని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పందుల బెడద తొలగించాలని ఆయా గ్రామాల్లోని ప్రజలు అధికారులను కోరారు. పందుల ను తరలించుకు పోవాలని యజమానులకు పంచాయతీ అధికారులు పలుమార్లు హెచ్చరించినా వారు పట్టించుకోవడం లేదు. దీంతో పలుమార్లు పంచాయతీ అధికారులు రంగంలోకి దిగి పందులను పట్టించి ఊరికి దూరంగా వదిలిన సంఘటనలు ఉన్నాయి. అయితే యజమానులు వాటిని యథావిధిగా తీసుకువచ్చి గ్రామాల్లో విడిచి పెడుతున్నట్టు ప్రజలు వాపోతున్నారు. ఇకనైనా అధికారులు స్పందించి పందుల బెడద నుంచి శాశ్వత పరిష్కారం చూపాలని గ్రామీణులు కోరుతున్నారు.



బాలాయపల్లిలో నివాసాల మధ్య సంచరిస్తున్న పందులు

చంద్రబాబును కలిసిన ఎమ్మెల్యే పాశం



గూడూరు, జూన్ 7: గూడూరు నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థిగా పాశం సునీల్‌కుమార్ గెలుపొందడంతో గురువారం రాత్రి ఉండవల్లిలో టీడీపీ అధినేత చంద్రబాబుని మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. దీంతో చంద్రబాబు అభినందించినట్లు పాశం తెలిపారు.

చంద్రబాబును కలిసిన ఎమ్మెల్యే రామకృష్ణ





వెంకటగిరి, జూన్ 7: ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ గురువారం అమరావతిలోని పార్టీ కార్యాయంలో టీడీపీ అధ్యక్షుడు చంద్రబాబును, టీడీపీ జాతీయ కార్యదర్శి నారా లోకేశ్‌ను మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛాలు అందించి అభినందనలు తెలిపారు. అదే విధంగా అమరావతి నుంచి శుక్రవారం నెల్లూరుకు చేరుకున్న ఆయన ఎమ్మెల్యేలు పొంగూరు నారాయణ, ఆనం రామనారాయణ రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛాలందించి అభినందనలు తెలిపారు.

అన్ని రంగాల్లో పారదర్శక పాలన: విజయశ్రీ



విజయశ్రీ, పార్థసారథి దంపతులను సన్మానిస్తున్న టీడీపీ నాయకులు

నాయుడుపేట, జూన్ 7: అన్ని రంగాల అభివృద్ధిలో పారదర్శక పరిపాలన కూటమి ప్రభుత్వం అందిస్తుందని ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ అన్నారు. నాయుడుపేట పట్టణంలో శుక్రవారం ఎమ్మెల్యే విజయశ్రీ, పార్థసారథి దంపతులను టీడీపీ నాయకులు, ప్రముఖ వ్యాపారవేత్తలు పూనాటి తిరుమలనాయుడు, జీవీఆర్‌నాయుడు శాలువా, గజపూలమాలతో సత్కరించారు. ఈ సందర్భంగా విజయశ్రీ మాట్లాడుతూ... నియోజకవర్గంలో మౌలిక సదుపాయాలను వేగవంతంగా అందిస్తామన్నారు. అలాగే సుదీర్ఘ కాలంగా అపరిష్కృతంగా ఉన్న సమస్యలను పరిశీలించి పరిష్కరిస్తామన్నారు. గాంధీనాయుడు, లక్ష్మీనరసింహనాయుడు, వెంగయ్య నాయుడు, నరసింహనాయుడు, సంపత్‌నాయుడు, శ్రీనివాసులునాయుడు, రామానాయుడు తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

ఎమ్మెల్యే నారాయణను కలిసిన వేనాటి సతీష్ రెడ్డి



సూళ్లూరుపేట, జూన్ 7: సార్వత్రిక ఎన్నికల్లో విజయం సాధించిన నెల్లూరు సిటీ, ఆత్మకూరు ఎమ్మెల్యేలు పొంగూరు నారాయణ, ఆనం రామనారాయణ రెడ్డిని శుక్రవారం టీడీపీ జిల్లా కార్యదర్శి వేనాటి సతీష్ రెడ్డి నెల్లూరు వారి నివాసంలో మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేసి అభినందనలు తెలిపారు. జడ్పీటీసీ మాజీ సభ్యుడు ఎం. శ్రీహరి రెడ్డి, బాలకృష్ణ చౌదరి ఉన్నారు.

చంద్రబాబును కలిసిన ఎమ్మెల్యేలు



సూళ్లూరుపేట, జూన్ 7: సార్వత్రిక ఎన్నికల్లో ఘన విజయం సాధించిన సూళ్లూరుపేట ఎమ్మెల్యే నెలవల విజయశ్రీతో పాటు సత్యవేడు, వెంకటగిరి, గూడూరు ఎమ్మెల్యేలు ఆదిమూలం, సునీల్ కుమార్, కురుగొండ్ల రామకృష్ణ, టీడీపీ నేత కొండేపాటి గంగాప్రసాద్ గురువారం రాత్రి ఉండవల్లిలోని చంద్రబాబు నివాసంలో ఆయన్ను మర్యాదపూర్వకంగా కలిసి ఆశీస్సులు అందుకున్నారు. నాలుగు నియోజకవర్గాల్లో టీడీపీ గెలుపునకు కృషి చేసిన కొండేపాటిని చంద్రబాబు అభినందించారు.

కొండేపాటి ఇంటి వద్ద కోలాహలం..



ఎన్నికల్లో టీడీపీ విజయం సాధించడంతో కొండేపాటి గంగాప్రసాద్ ఇంటి వద్ద కోలాహలం నెలకొనింది. సూళ్లూరుపేట, సత్యవేడు, గూడూరు, వెంకటగిరి నియోజకవర్గాల నుంచి టీడీపీ నాయకులు విచ్చేసి మర్యాదపూర్వకంగా కలిసి అభినందనలు తెలియజేస్తున్నారు. శుక్రవారం పార్టీ నాయకులు, కార్యకర్తలు కొండేపాటిని ఘనంగా సన్మానించారు.

కురుగొండ్ల విజయాన్ని పురస్కరించుకుని...

పేదలకు బిర్యానీ ప్యాకెట్ల పంపిణీ



వెంకటగిరి, జూన్ 7: వెంకటగిరిలో ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ, రాష్ట్రంలో కూటమి విజయాన్ని పురస్కరించుకొని శుక్రవారం ముస్లింలు పట్టణంలోని కాశీపేట కూడలిలో బిర్యానీ ప్యాకెట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా టీడీపీ జిందాబాద్, కురుగొండ్ల నాయకత్వం వర్ధిల్లాలి అంటూ పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. ఈ కార్యక్రమంలో ఎస్‌కే అల్తాఫ్, ఎస్‌కే గౌస్‌బాషా, పి.ఖాదర్‌ఖాన్, మస్తాన్, ఎస్‌కే రబ్బానీ, జనసేన పార్టీ నాయకుడు రియాజ్ తదితరులు పాల్గొన్నారు.

వృద్ధాశ్రమంలో అన్నదానం

గూడూరు అర్బన్, జూన్ 7: పట్టణంలోని సాయిరాం చారిటీస్ వృద్ధాశ్రమంలో శుక్రవారం శ్రీ కృష్ణ సేవా సమితి అధ్యక్షుడు మయూరి శ్యామ్‌యాదవ్ ఆధ్వర్యంలో వృద్ధులకు అన్నదానం జరిగింది. కార్యక్రమంలో మహేశ్వరి, కల్యాణి తదితరులు పాల్గొన్నారు.

కనుపూరు ముత్యాలమ్మ హుండీ లెక్కింపు

చిల్లకూరు, జూన్ 7 : మండలంలోని తూర్పు కనుపూరు గ్రామంలో కొలువై ఉన్న ముత్యాలమ్మ అమ్మవారి హుండీ లెక్కింపు శుక్రవారం జరిగింది. అమ్మవారి హుండీలో భక్తులు నగదు రూపంలో వేసిన కానుకలు రెండు నెలలకు గాను రూ.30,17,383 ఆదాయం వచ్చినట్లు ఈవో నవీన్ కుమార్ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆలయ పాలక మండలి చైర్‌పర్సన్ ఇంద్రసేనమ్మ, సభ్యుడు చంద్రశేఖర్‌రెడ్డి దేవదాయ శాఖ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసబాబు తదితరులు పాల్గొన్నారు.

ప్రజలకు రుణపడి ఉంటా: సునీల్



మాట్లాడుతున్న ఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్

గూడూరు, జూన్ 7: ఈ ఎన్నికల్లో 21 వేలకు పైగా మెజార్టీతో తనను ఎమ్మెల్యేగా గెలిపించిన నియోజకవర్గ ప్రజలకు రుణపడి ఉంటానని ఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్ అన్నారు. శుక్రవారం పట్టణంలోని టీడీపీ కార్యాలయంలో ఎన్టీఆర్ విగ్రహానికి నివాళి అర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ... తాను ఎవరిపై కక్షసాధింపు చర్యలకు పాల్పడనని, టీడీపీ కార్యకర్తల జోలికి వస్తే వదిలే ప్రసక్తే లేదన్నారు. వైసీపీ ప్రభుత్వంలో అవినీతిని వెలికి తీస్తామని, అధికారులు న్యాయబద్ధంగా విధులు నిర్వహించాలన్నారు. చిల్లకూరు మండలంలో సిలికా తవ్వకాల్లో జరిగిన అవినీతి విచారణ నిర్వహించడంతోపాటు అక్రమ రవాణా అరికడతామన్నారు. అసంపూర్తిగా ఉన్న ఫ్లైఓవర్ నిర్మాణాన్ని పూర్తి చేయిస్తానన్నారు. గూడూరు చెరువును ఆధునికీకరిచడంతోపాటు కట్టపై వాకింగ్ ట్రాక్‌ను ఏర్పాటు చేస్తామన్నారు. పట్టణ పరిధిలోని, మండలాల్లోని సమస్యలను ఒక్కొక్కటిగా పరిష్కరిస్తామన్నారు. పార్టీ కార్యాలయంలో కాల్ సెంటర్‌ను ఏర్పాటు చేస్తామని నియోజకవర్గ పరిధిలో ఎవరికైనా సమస్యలుంటే సమాచారం అందిస్తే చర్యలు తీసుకుంటామన్నారు. తన విజయానికి కృషి చేసిన టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులకు, కార్యకర్తలకు కృతజ్ఞతలు తెలుపుతున్నామన్నారు. ఎస్.కిరణ్‌కుమార్, ఎన్.భాస్కర్‌రెడ్డి, పి.శ్రీనివాసులు, వెంకటేశ్వర్లురాజు, ఆరికట్ల మస్తాన్ నాయుడు, బి.చెంచురామయ్య, వి.శివకుమార్, పి.నాగరాజు, ఎం.శ్రావణి, జి.లీలావతి, పెంచలయ్య, వెంకటేశ్వర్లురెడ్డి, సర్వోత్తమరెడ్డి, జలీల్‌అహ్మద్, కిషోర్‌నాయుడు, మధుసూదన రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

వెంకటగిరి, జూన్ 7: పట్టణంలోని పాలకేంద్రం వద్ద ఉన్న 132 కేవీ సబ్ స్టేషన్‌లో మర్మతులక కారణంగా శనివారం ఉదయం 8 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు విద్యుత్ సరఫరా ఉండదని ట్రాన్స్‌కో డీఈఈ మునిరవి చంద్ర తెలిపారు. సబ్ స్టేషన్ పరిధిలోని వెంకటగిరి పట్టణం సహా మండలం, డక్కిలి, బాలాయపల్లి మండలాల విద్యుత్ వినియోగదారులు, రైతులు సహకరించాల్సిందిగా ఆయన కోరారు.

గత ఎన్నికలతో పోలిస్తే

నోటాకు, కాంగ్రెస్‌కు పెరిగిన ఓట్లు

గూడూరు అర్బన్, జూన్ 7: గత ఎన్నికలతో పోలిస్తే గూడూరు నియోజకవర్గ పరిధిలో నోటాకు, కాంగ్రెస్‌కు ఈ దఫా ఓట్ల సంఖ్య పెరిగింది. 2019 ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి నియోజకవర్గంలో 1,234 ఓట్లు వచ్చాయి. 2024 సార్వత్రిక ఎన్నికల్లో పోస్టల్‌బ్యాలెట్‌తో కలిపి 3,308 ఓట్లు పోలయ్యాయి. దీంతో గత ఎన్నికలతో పోలిస్తే ఈ ఎన్నికల్లో కాంగ్రెస్‌పార్టీకి 2,074 ఓట్లు అధికంగా వచ్చాయి. అదేవిధంగా 2019 ఎన్నికల్లో నోటాకి 2,885 ఓట్లు పోలయ్యాయి. ఈ ఎన్నికల్లో నోటాకు పోస్టల్ బ్యాలెట్‌తో కలిపి 3,129 ఓట్లు నమోదయ్యాయి. గత ఎన్నికలతో పోలిస్తే నోటాకు 244 ఓట్లు అధికంగా వచ్చాయి.

సూళ్లూరుపేటలో కాంగ్రెస్‌కు ఓట్లు పెరిగాయోచ్!

తడ, జూన్ 7 : ఒకప్పుడు అటు రాష్ట్రాన్ని... ఇటు దేశాన్ని ఏకచ్ఛత్రాధిపత్యంగా ఏలిన కాంగ్రెస్... 2014 నుంచి గడ్డు పరిస్థితులను ఎదుర్కొంటుంది. కారణం ఉమ్మడి రాష్ట్రాన్ని విడగొట్టిందన్న అపవాదుతో ప్రజలు ఆ పార్టీకి పూర్తిగా దూరమయ్యారు. లక్షల సంఖ్యలో ఉన్న ఓటర్లు కాస్తా వందల సంఖ్యలోకి జారి పోయారు. ఆ పార్టీపై కనీస సానుభూతి కరువైంది. 2014 ఎన్నికల్లో ఆ పార్టీ నుంచి పోటీ చేసిన డి.మధుసూదన్‌రావుకు కేవలం 2,798 ఓట్లు మాత్రమే పోలైనాయి. అప్పటి నుంచి సంస్థాగతంగా ఆ పార్టీ బలపడలేక పోతోంది. 2019 ఎన్నికల్లో ఆ ఓట్ల సంఖ్య ఇంకొంచం తగ్గింది. అప్పట్లో ఆ పార్టీ తరఫున పోటీ చేసిన కె.ఈశ్వరయ్యకు 2,698 ఓట్లు మాత్రమే పోలవడంతో ఇక కాంగ్రెస్‌పార్టీకి అంధ్రరాష్ట్రంలో స్థానం లేదన్న వాదన వినిపించింది. ఈ క్రమంలో 2024 ఎన్నికల్లో అనూహ్యంగా ఆ పార్టీకి ఓట్లు పెరిగాయి. ఈ ఎన్నికల్లో ఆ పార్టీ నుంచి పోటీ చేసిన కె.శివకు 4,124 ఓట్లు పోలయ్యాయి. ఈ దశాబ్దంలో రెండు ఎన్నికలు జరిగిన తరువాత ఇప్పుడు కొద్దోగొప్పో ఆ పార్టీకి ఓట్లు పెరిగాయోచ్ అంటూ కొందరు మాట్లాడుకోవడం కన్పించింది. అందుకు ప్రస్తుతం రాష్ట్ర పీసీసీ సారథి షర్మిల చరిష్మ కారణమని రాబోయే రోజుల్లో కాంగ్రెస్ పార్టీ బలం పుంజుకోవడం ఖాయమని కొందరు వ్యాఖ్యానిస్తున్నారు.

కాలువల్లో పేరుకుపోయిన వ్యర్థాలు







ఆర్అండ్‌బీ బంగ్లా వద్ద , వినాయకుడి గుడి వద్ద , జీఎన్‌టీ రోడ్డు చర్చి వద్ద వ్యర్థాలతో నిండిన మురుగుకాలువ

సూళ్లూరుపేట, జూన్ 7: అంతర్జాతీయంగా పేరు గాంచిన షార్ కేంద్రం పక్కనే ఉన్న సూళ్లూరుపేట పట్టణం కనీసం మురుగునీరు పారుదలకు సరైన కాలువలు లేక పలుచోట్ల రోడ్లపై ప్రవహిస్తున్నాయి. ప్రధాన కూడళ్లలో, బజారు వీధుల్లో మురుగునీటిలో నడిచి పోవాల్సి వస్తోంది. గడిచిన ఐదేళ్లలో పాలకులు పట్టించుకున్న పాపానపోలేదు. పన్నుల రూపంలో వేలాది రూపాయలు వసూలు చేస్తున్నా ప్రజలకు సౌకర్యాల కల్పనలో మున్సిపాలిటీ అధికారులు విఫలమవుతున్నారు. పట్టణంలోని జీఎన్‌టీ రోడ్డులో, ఆర్టీసీ బస్టాండు సమీపం, పోలీస్‌స్టేషన్ పక్కన, ఆర్అండ్‌బీ బంగ్లా వద్ద మురుగుకాలువలు చెత్తాచెదారాలతో నిండి చిన్న పాటి వర్షమొచ్చినా మురుగు రోడ్లపై పారుతోంది. హోలిక్రాస్ సర్కిల్, గాండ్ల వీధి సచివాలయం వద్ద, ప్రభుత్వ ఆస్పత్రి రోడ్డు ఎదురుగా కాలువల్లో నుంచి పొంగిన మురుగు నిలిచిపోవడంతో వాహన చోదకులు, పాదచారులు, స్థానికులకు ఇబ్బందులు తప్పడం లేదు. ఎక్కడ చూసినా కాలువల్లో ప్లాస్టిక్ బాటిళ్లు, కవర్లతో పాటు వ్యర్థాలు పేరుకుపోయి ఉన్నాయి. సైడ్ కాలువల్లో మున్సిపాలిటీ పారిశుధ్య సిబ్బంది పూడిక తీయడం లేదు. బుధవారం కురిసిన వర్షానికి రోడ్ల పైకి వర్షపు నీరు చేరింది. మున్సిపాలిటీ పారిశుధ్య సిబ్బంది స్పందించి మురుగు కాలువల్లో పేరుకుపోయిన వ్యర్థాలను తొలగించి పూడిపోయిన చోట పూడిక పనులు చేయించి మురుగునీరు రోడ్లపైకి ప్రవహించకుండా చూడాలని పట్టణవాసులు కోరుతున్నారు.



గాండ్లవీధి సచివాలయం వద్ద రోడ్డుపై మురుగునీరు

శాంతిభద్రతలకు ప్రజలు సహకరించాలి

గూడూరు, జూన్ 7: డివిజన్ పరిధిలోని ప్రజలు ఎన్నికలు పూర్తయిన నేపథ్యంలో ఏలాంటి హింసాత్మక ఘటనలకు పాల్పడకుండా పోలీసులకు సహకరించాలని డీఎస్పీ సూర్యనారాయణరెడ్డి శుక్రవారం పేర్కొన్నారు. అనవసరైన ఆవేశాలు, భావోద్వేగాలతో హింసాత్మక ఘటనలకు పాల్పడకూడదన్నారు. శాంతియుత వాతావరణానికి భంగం కలిగించకుండా నడుచుకోవాలన్నారు. చట్టపరిధిలో సమస్యకు పరిష్కార మార్గాలను చూడాలన్నారు. ఎవరైనా రౌడీయిజం, దౌర్జన్యాలకు వాటికి పాల్పడితే చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. శాంతిభద్రతల పరిరక్షణకు ప్రతిఒక్కరూ సహకరించాలన్నారు.

మొక్కలు నాటేందుకు స్థలం చూపాలంటూ వినతి

తడ, జూన్ 7: మండలంలో సుమారు 1.50 లక్షల మొక్కలు నాటేందుకు స్థలం చూపాల్సిందిగా సైన్స్ ఆఫ్ ఇండియా పత్రిక రెవెన్యూ అధికారులను కోరింది. గత నెల 29వ తేదీ ఈ మేరకు కలెక్టర్‌కు వినతిపత్రం అందింది. దీంతో ఆయన తడ తహసీల్దారుకు ప్రభుత్వ స్థలాన్ని పరిశీలించాల్సిందిగా ఆదేశించారు. ఆదేశాల మేరకు తడకండ్రిగ పంచాయతీ సర్వేనెం.213లో 192 ఎకరాల దయాళ్ భూములను గుర్తించామని తహసీల్దారు సయ్యద్ ఇక్బాల్ తెలిపారు. దానిపై సర్వే నిర్వహించామని మొక్కలు సరఫరా చేసే సదరు సంస్థకు ఆ వివరాలు తెలిపామని ఆయన శుక్రవారం తెలిపారు. దానిపై సదరు సంస్థ ప్రతినిధులు త్వరలోనే స్థల పరిశీలనకు వస్తారన్నారు.

జీవో 117ను రద్దు చేయాలి: యూటీఎఫ్



సభలో మాట్లాడుతున్న శ్రీనివాసరావు

గూడూరు, జూన్ 7: జీవో 117ను రద్దు చేయాలని యూటీఎఫ్ ఆధ్వర్యంలో నూతన ప్రభుత్వానికి విన్నవిస్తున్నట్లు యూటీఎఫ్ రాష్ట్ర గౌరవాధ్యక్షుడు శ్రీనివాసరావు చెప్పారు. శుక్రవారం స్థానిక విశ్రాంత ఉద్యోగుల భవనంలో యూటీఎఫ్ ఆధ్వర్యంలో సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలల వ్యవస్థను కొనసాగించాలన్నారు. పాఠశాలల విలీనాన్ని రద్దు చేయాలన్నారు. ఉద్యోగ, ఉపాధ్యాయుల పెండింగ్ బిల్లులను వెంటనే చెల్లించాలన్నారు. విద్యార్థులకు మాధ్యమాన్ని ఎంచుకునే సౌలభ్యం కల్పించాలన్నారు. మెగా డీఎస్సీ ద్వారా ఖాళీలను భర్తీ చేయాలన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి నవకోటేశ్వరరావు, రాజశేఖర్, సూర్యప్రకాష్, శేఖర్, శ్రీదేవి, నిర్మల తదితరులు పాల్గొన్నారు.

నిఘా నీడనే గ్రామాలు

కోట, జూన్ 7 : మండలంలోని పలు సమస్యాత్మక గ్రామాలు ఇప్పటికీ నిఘా నీడలోనే ఉన్నాయి. ఈ మేరకు ఆయా సమస్యాత్మక గ్రామాలపై డేగకన్ను వేసినట్లు ఎస్ఐ నాగబాబు శుక్రవారం తెలిపారు. సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో వాకాడు సీఐ హరికృష్ణ పర్యవేక్షణలో ఎస్ఐ నాగబాబు ఆధ్వర్యంలో అత్యంత సమస్యాత్మక పంచాయతీలైన కొత్తపట్నం, కోట, కేశవరంలో పోలీస్ పికెట్ ఇప్పటికీ కొనసాగుతూనే ఉన్నాయి. కేశవరం పంచాయతీలో ఎక్కువమందిపై రౌడీషీట్లు ఓపెన్ చేసి ఉండటంతో నిఘా పటిష్ఠ పరుస్తున్నారు. మద్దాలి, చిట్టేడు, వెంకన్నపాళెం, నెల్లూరుపల్లి కొత్తపాళెంలల్లో నిఘా కొనసాగుతోంది.

ఎస్వీయూలో అక్రమాలపై

న్యాయ విచారణ చేపట్టాలి

తిరుపతి అర్బన్, జూన్ 7: ఎస్వీయూలో ఐదేళ్లుగా జరిగిన అక్రమ నియామకాలు, పదోన్నతులు, నిధుల దుర్వినియోగంపై న్యాయ విచారణ జరిపించాలని తెలుగుయువత రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రాగల ఆనంద్ గౌడ్ డిమాండ్ చేశారు. శుక్రవారం ప్రెస్‌క్లబ్‌లో మీడియాతో మాట్లాడుతూ.. ఎస్వీయూ రెక్టార్‌గా, వీసీగా ఉన్న సమయంలో ప్రొఫెసర్ శ్రీకాంత్‌రెడ్డి ఎన్నో అక్రమాలకు పాల్పడ్డారని, పాలకమండలి నిర్ణయాలను తుంగలో తొక్కారని విమర్శించారు. ఆయనపై చర్యలు తీసుకోవాలన్నారు. ఎస్వీయూ అక్రమాలకు సంబంధించి గవర్నర్‌కు లేఖ రాశామని గుర్తుచేశారు. ఎన్నికల ప్రవర్తన నియమావళిని లెక్కచేయక నియామకాలు చేపట్టారని, రుసా నిధులు కూడా దుర్వినియోగం చేయడం దారుణమన్నారు. తెలుగుయువత్ రాష్ట్ర అధికార ప్రతినిధి శేషాద్రినాయుడు, రామ్మోహన్ తదితరులు పాల్గొన్నారు.


రైలు ప్రమాదాలు జరగకుండా జాగ్రత్తలు తీసుకోండి: సీఆర్ఎస్ఓ



రేణిగుంటలో అధికారులతో చర్చిస్తున్న సీఆర్ఎస్ఓ మాధవి

తిరుపతి(ఆటోనగర్), జూన్ 7: రైలు ప్రమాదాలు జరగకుండా అధికారులు పటిష్ఠమైన జాగ్రత్తలు తీసుకోవాలని దక్షిణ మధ్య రైల్వే చీఫ్ రైల్వే సేఫ్టీ ఆఫీసర్ మాధవి ఆదేశించారు. రేణిగుంట- కాట్పాడి రైల్వే జంక్షన్ల మధ్య రైలు మార్గం తనిఖీల్లో భాగంగా శుక్రవారం రేణిగుంట రైల్వే జంక్షన్‌లోని కీలకమైన విభాగాలు పరిశీలించారు. ప్రధానంగా లోకో పైలట్లు, గార్డులకు విధులు కేటాయించే విభాగంలో రికార్డులు తనిఖీ చేశారు. ఇటీవల యార్డులో జరిగిన ప్రమాదాలను అడిగి తెలుసుకున్నా రు. గూడ్స్ రైళ్ల పట్టాలు తప్పిన సంఘటనలపైనా ఆరా తీశారు. అనంతరం స్టేషన్ మాస్టర్ల విభాగాన్ని తనిఖీ చేశారు. గుంతకల్లు డివిజన్ ఏడీఆర్ఎం సుధాకర్, సీనియర్ స్కేల్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

ధర్మారెడ్డికి దండన తప్పదు: టీడీపీ



మీడియాతో మాట్లాడుతున్న ఇనుకొండ సుబ్రహ్మణ్యం

తిరుపతి అర్బన్, జూన్ 7: టీటీడీని అప్రతిష్ఠపాలు చేసిన ఈవో ధర్మారెడ్డికి శిక్ష తప్పదని టీడీపీ నేత ఇనుకొండ సుబ్రహ్మణ్యం జోస్యం చెప్పారు. శుక్రవారం ప్రెస్‌క్లబ్‌లో మీడియాతో మాట్లాడుతూ.. ఈవో, ఆయన అనుచర ఉద్యోగులు లెక్కలేనన్ని పాపాలు చేశారన్నారు. అక్రమాలకు పాల్పడి.. తిరుమలను అపవిత్రం చేశారన్నారు. కల్యాణకట్టలో వైఎస్సార్ ట్రేడ్ యూనియన్‌ను స్థాపించి క్షురకుల నుంచి ముడుపులు వసూలు చేశారన్నారు. ఈ విషయాన్ని ఈవో పట్టించుకోలేదని, అమాయకపు క్షురకులను మాత్రం వేధించేవారన్నారు. టీటీడీ ఉద్యోగుల ఇళ్ల స్థలాల్లోనూ రోజాకు వాటా ఉందన్నారు. ఇలా రాష్ట్రవ్యాప్తంగా వైసీపీ దోచేసిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. అందువల్లే ప్రజలు సరైన సమాధానం ఇచ్చారన్నారు.

మురుగునీరు కదలక అవస్థలు

చిల్లకూరు, జూన్ 7: డ్రైనేజీ కాలువల్లో పేరుకుపోయిన చెత్తాచెదారాన్ని తొలగించకపోవడంతో మురుగు కదలక చిల్లకూరువాసులు ఇబ్బంది పడుతున్నారు. నెల రోజుల క్రితం తొలగించిన చెత్తాచెదారాన్ని కాలువ పక్క నుంచి తొలగించపోవడంతో తిరిగి వాటిల్లోనే పడడంతో ఈ పరిస్థితి తలెత్తిందని స్థానికులు చెబుతున్నారు.ప్రధానంగా వడ్డిపాళెంలో మురుగునీటి కాలువల్లో చెత్తాచెదారం తొలగించక పోవడంతో దుర్వాసన వెదజల్లుతోందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వర్షం కురిస్తే వాననీటితోపాటు మురుగు రోడ్లపై పారుతోందంటున్నారు. వర్షానికి కాలువల్లో మురుగు కదలక పోవడంతో స్థానికులే శుభ్రం చేసుకున్నారు. ఇకనైనా సంబంధిత అధికారులు స్పందించాల్సి ఉందని స్థానికులు కోరుతున్నారు.



వడ్డిపాళెంలో సిమెంటురోడ్డుపై నిలిచివున్న మురుగు

కారు బోల్తా: ఒకరికి స్వల్ప గాయాలు


నాయుడుపేట టౌన్, జూన్ 7: నాయుడుపేట - నరసారెడ్డికండ్రిగ జాతీయ రహదారి కూడలి వద్ద కారు బోల్తా పడిన ఘటనలో వృద్ధురాలు స్వల్పంగా గాయపడ్డారు. నాయుడుపేట పట్టణానికి చెందిన న్యాయవాది పసల చెంగయ్య శుక్రవారం రాత్రి తన కుటుంబీకులతో కలసి కారులో నెల్లూరుకు వెళ్లి తిరిగి వస్తుండగా నరసారెడ్డికండ్రిగ కూడలి వద్ద మలుపు తిరుగుతుండగా చెన్నై నుంచి నెల్లూరు వెళ్తున్న కారు ఢీ కొనింది. ఈ ఘటనలో కారు రోడ్డు పక్కన ఉన్న తూములో పడిపోయింది. గమనించిన స్థానికులు కారులో ప్రయాణిస్తున్న వారిని వెలికి తీశారు. వారిలో ఓ వృద్ధురాలికి మాత్రమే గాయాలయ్యాయి.

నేడు సీతారాముల కల్యాణం

కోట, జూన్ 7: పట్టణ పరిధిలోని శ్యామసుందరపురంలో అభయాంజనేయస్వామి ఆలయ ప్రథమ వార్షికోత్సవాన్ని పురస్కరించుకొని ఈనెల 8న ప్రత్యేక పూజలు, కార్యక్రమాలు జరగనున్నాయి. ఆలయ ధర్మకర్తల ఆధ్వర్యంలో ఉదయం ఆలయ ప్రాంగణంలో భజన కార్యక్రమాలుంటాయి. అదే విధంగా శ్రీసీతారామ ధార్మిక సేవా సంస్థ ఆధ్వర్యంలో అభయాంజనేయస్వామి చిత్రపటంతో శ్యామసుందరపురంలో గ్రామోత్సవం జరగనుంది. ఆయా గ్రామాల నుంచి వచ్చిన భక్తులకు అన్నదానం చేస్తారు. ఈ సందర్భంగా సీతారాముల కల్యాణాన్ని నిర్వహించనున్నారు.

ఎన్డీఏ కూటమిలో బీసీలకు పెద్దపీట

ఏఎంసీ మాజీ చైర్మన్ విజయభాస్కర్‌రెడ్డి



విజయభాస్కర్‌రెడ్డిని సన్మానిస్తున్న బీసీ సంఘ నాయకులు

నాయుడుపేట టౌన్, జూన్ 7: ఎన్డీఏ కూటమిలో వెనుకబడిన తరగతుల వారికి పెద్దపీట వేయనున్నారని ఏఎంసీ మాజీ చైర్మన్ ఎస్.విజయభాస్కర్‌రెడ్డి అన్నారు. నాయుడుపేటలో శుక్రవారం విజయభాస్కర్‌రెడ్డిని సీమాంధ్ర బీసీ సంఘ సూళ్లూరుపేట నియోజకవర్గ అధ్యక్షుడు జి.మస్తాన్ సన్మానించారు. ఈ సందర్భంగా విజయభాస్కర్‌రెడ్డి మాట్లాడుతూ... సామాజికంగా, ఆర్థికంగా వెనుకబడిన బీసీలకు టీడీపీ ప్రభుత్వంలో ఆదరణ పథకం ద్వారా వివిధ రకాల వృత్తిదారులకు వారికి అవసరమైన పనిముట్లను అందజేసిందన్నారు. అలాగే బీసీ కార్పొరేషన్ ద్వారా రూ.2 లక్షలు రుణంలో లక్ష రూపాయలు రాయితీ అందించిందని గుర్తు చేశారు. బీసీ సంఘ నాయకులు ప్రతాప్, రామయ్య, వినోద్, ప్రసాద్, శేఖర్, శివ, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

పెళ్లకూరు: మండలంలోని శిరసనంబేడులో శుక్రవారం టీడీపీ యువ నాయకుడు వి.కల్యాణ్‌రెడ్డి ఆధ్వర్యంలో ఎన్డీఏ భారీ మెజార్టీ రావడంపై సంబరాలు జరిపారు. సూళ్లూరుపేట ఎమ్మెల్యే విజయశ్రీ భర్త పార్థసారథిని సత్కరించారు. అనంతరం కేక్‌ను కట్‌చేసి టీడీపీ నాయకులకు, అభిమానులకు పంచిపెట్టారు. సురేష్‌రెడ్డి, కె.సునీల్, సిసింద్రి, సునీల్ పాల్గొన్నారు.